గురుగు	14,500
నీటి కాయ (పెద్దది)	16,000-17,000
మధ్య రకం (చిన్నది)	15,000-17,500
అంబాజీపేట కొబ్బరినూనె మార్కెట్	
15 కిలోల	3,750
కిలో	260
నెక్ చికెన్ ధర	
పారెంటులు	121-00
లెవెల్ బైర్	143-00
స్కిన్	207-00
స్కిన్‌లెస్	236-00



ఈనాడు ప్రతిభ

pratibha.eenadu.net/eenadupratibha.net

ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్



✦ గోవాలో ఏటా నిర్వహించే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ) 55, 56వ ఎడిషన్లకు డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?

జ: ప్రముఖ భారత దర్శకుడు శేఖర్ కపూర్

✦ 2024-2025 సంవత్సరానికి 'ఆసియా డిజాస్టర్ ప్రిపేర్డ్‌నెస్ సెంటర్ (ఏడీపీసీ) అధ్యక్ష బాధ్యతలను ఇటీవల ఏ దేశం చేపట్టింది?

జ: భారత్

మాదిరి ప్రశ్నలు

(ఎన్‌డీఎంఏ సభ్యుడు, విభాగాధిపతి రాజేంద్రసింగ్ 2024, జులై 25న ఏడీపీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు)

✦ దేశంలోనే తొలిసారిగా ఏ ఓడరేవులో సమగ్ర వ్యవసాయ ఎగుమతి సౌకర్యాన్ని (ఇంటిగ్రేటెడ్ అగ్రి ఎక్స్‌పోర్ట్ ఫెసిలిటీ) అభివృద్ధి చేస్తున్నారు? (ఈ ప్రాజెక్టు విలువ రూ.284.19 కోట్లు. విస్తీర్ణం 67,422 చదరపు మీటర్లు. ఈ ఓడరేవు ఇప్పటికే దేశంలో మొదటి 100 శాతం ల్యాండ్ లార్డ్ పోర్టుగా గుర్తింపు పొందింది.)

జ: జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు, ముంబయి

✦ 'వరల్డ్ హెపటైటిస్ డే'ను ఏటా ఏ రోజు నిర్వహిస్తారు? ('ఇట్స్ టైం ఫర్ యాక్షన్' అనేది ఈ ఏడాది థీమ్.)

జ: జులై 28

✦ దేశంలో 500వ కమ్యూనిటీ రేడియో స్టేషన్ 'అప్నా రేడియో 90.0 FM'ను ఇటీవల ఎక్కడ ప్రారంభించారు?

జ: ఐజ్వాల్

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

అన్ని సబ్జెక్టులను చదవడానికి, రివిజన్‌కు వీలు కల్పించే విధంగా స్టడీప్లాన్ సిద్ధం చేసుకోవాలి. సబ్జెక్టుల వారీగా అభ్యర్థుల బలాలు, బలహీనతల ఆధారంగా ఆ ప్రణాళిక ఉండేలా చూసుకోవాలి.

డీఎస్సీ/టెట్ - 2024

తెలుగు కంటెంట్

పదోతరగతి

తెలుగు

ప్రత్యక్ష దైవాలు



తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు!

ప్రశ్నలు జవాబులు

1) 'ప్రత్యక్ష దైవాలు' పాఠం రచించిన కవి గురించి రాయండి. (4 మా.)

జ: 'ప్రత్యక్ష దైవాలు' పాఠం రచించిన కవి ఎఱ్ఱన.

కాలం: క్రీ.శ.14వ శతాబ్దం. తల్లిదండ్రులు: పోతమ్మ, సూరనలు. జననం: పాకనాడు సీమ (నెల్లూరు జిల్లా కందుకూరు సమీపంలోని గుడ్లూరు గ్రామం). ఉద్యోగం: అద్దంకిని రాజధానిగా చేసుకుని పరిపాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి. రచనలు: రామాయణం, హరివంశం, అరణ్యపర్వశేషం, నృసింహపురాణం బిరుదులు: శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు. రచనా శైలి: సూక్తి వైచిత్రితో పేరెన్నిక గన్నది. ◆ ప్రస్తుత పాఠ్యాంశాన్ని మహాభారతంలోని అరణ్యపర్వంలోని 5వ ఆశ్వాసం నుంచి గ్రహించారు.

2) వృద్ధాశ్రమాలు పెరిగిపోతున్న నేటి రోజుల్లో 'తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు' అనే ధర్మవ్యాధుడి అభిప్రాయ ప్రాధాన్యతను పాఠం ఆధారంగా వివరించండి. (8 మా.)

జ: తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదని మన పురాణాలు, ఇతిహాసాలు, శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ✦ తల్లిదండ్రులే పిల్లలకు ప్రత్యక్ష దైవాలు. ✦ వారిని కష్టపెట్టకూడదు. ✦ కేవలం అమ్మానాన్నలను పూజించడం తప్ప వేరే దైవాన్ని కూడా పూజించని ధర్మవ్యాధుడు ధర్మాత్ముడు అయ్యాడు. ✦ వేదాలు, శాస్త్రాలు చదివిన కౌశికుడి లాంటి వ్యక్తికి కూడా ధర్మసూక్ష్మాలు తెలిపాడు. ✦ మనకు శరీరాన్నిచ్చి, పెంచి, పోషించి ఒకస్థాయికి తీసుకుని వచ్చిన తల్లిదండ్రులను మించిన దైవం లేదని ధర్మవ్యాధుడు తన మాటలు, ఆచరణ ద్వారా నిరూపించాడు. ✦ తల్లిదండ్రులను పట్టించుకోకుండా ఎంత జ్ఞానం సంపాదించినా, పుణ్య కార్యాలు చేసినా ప్రయోజనం లేదు. ✦ యజ్ఞాలు, వ్రతాలు, పూజలు అన్నీ చేసిన ఫలితం తల్లిదండ్రుల సేవ వల్ల లభిస్తుంది. ✦ ఇంట్లో కన్నవారి రూపంలో ఉన్న ప్రత్యక్ష దైవాలను వదిలి జ్ఞానం, పుణ్యం కోసం ఎక్కడెక్కడికో వెళ్లడం వెర్రితనం.

ముఖ్యమైనవి మరికొన్ని..

8 మార్కుల ప్రశ్నలు

1) ప్రత్యక్ష దైవాలు పాఠం సారాంశాన్ని మీ సొంత మాటల్లో రాయండి.

2) ఈ పాఠం ఆధారంగా ధర్మవ్యాధుడి వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.

జవాబుల కోసం

– చెరుకూరి వేంకట సూర్యనారాయణ శర్మ

మనుగడకు మూలాలు.. ప్రగతి సాధనాలు!

ఇండియన్ జాగ్రఫీ

ఆధునిక ప్రపంచం మనుగడ అంతా శక్తివనరులపైనే ఆధారపడి నడుస్తోంది. విద్యుత్తు తయారీకి, వాహనాలు నడిచేందుకు, వివిధ ఉత్పత్తులకు శిలాజ ఇంధనాలే ప్రధాన ఆధారాలు. ఆర్థిక, అభివృద్ధి కార్యకలాపాల్లో వాటిని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, ముడిచమురు, సహజవాయువు, అణుశక్తికి సంబంధించిన ప్రాథమికాంశాలను పరీక్షార్థులు తెలుసుకోవాలి. దేశంలో వాటి లభ్యత, విస్తరణ, ఉత్పత్తి తీరుతెన్నులు, ఆ కార్యకలాపాల్లో నిమగ్నమైన భారత ప్రభుత్వ సంస్థల గురించి అవగాహన కలిగి ఉండాలి.

శక్తివనరులు


ఆధునిక యుగంలో దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే ప్రధాన కారకం శక్తివనరు. ఏదైనా ఒక దేశం వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి ఇది చాలా అవసరం. ఒక ప్రదేశ ఆర్థిక అభివృద్ధి, అక్కడి శక్తిసంపద, దాన్ని వినియోగిస్తున్న విధానంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం శక్తివనరులను ప్రాథమిక స్థాయి నుంచి అంటే ఆహార పదార్థాలను వండుకోవడం నుంచి ఆధునిక స్థాయి అంటే పరిశ్రమలు, వ్యాపారం, రవాణా, సమాచార అభివృద్ధి వరకు బహుళ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారు. మూలాధారం, వినియోగం ఆధారంగా శక్తివనరులను రెండు రకాలుగా పేర్కొనవచ్చు. అవి 1) వాణిజ్యేతర శక్తి 2) వాణిజ్య శక్తి. అటవీ ఉత్పత్తులు, కర్రబొగ్గు, ఆవు పేడ, వ్యవసాయ వ్యర్థాలు, పశువుల శక్తి మొదలైనవి వాణిజ్యేతర శక్తి వనరులు. నేలబొగ్గు, సహజవాయువు, జలవిద్యుత్తు, చమురు (క్రూడ్ ఆయిల్), పవనశక్తి, సౌరశక్తి, అణుశక్తి మొదలైనవి వాణిజ్య శక్తికి ఉదాహరణలు. మరోవిధంగా శక్తివనరులు రెండు రకాలు అవి-

> దేశంలో బొగ్గు ఉత్పత్తిలో ముందంజలో ఉన్న రాష్ట్రాలు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్. ప్రస్తుతం 90% బొగ్గు ఉత్పత్తి ఉపరితల గనుల ద్వారా జరుగుతోంది. భారత్ బొగ్గును నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్‌కు ఎగుమతి చేస్తూ; ఇండొనేసియా, దక్షిణాఫ్రికాల నుంచి దిగుమతి చేసుకుంటోంది.

1) **తరిగిపోయేవి:** వాడిన కొద్దీ నిల్వలు తగ్గిపోతూ ఉంటాయి. పునరుత్పత్తి చేయడం కుదరదు. వీటినే సంప్రదాయ ఇంధన వనరులు అంటారు. అవి- బొగ్గు, చమురు, సహజవాయువు, అణుశక్తి, యురేనియం, థోరియం.

2) **తరగనివి:** ఎంత వాడినా, ఎన్నిసార్లు వాడినా తరిగిపోవు. మళ్లీ మళ్లీ ఉపయోగించవచ్చు. వీటినే సంప్రదాయేతర ఇంధన వనరులు అంటారు. అవి నీరు, గాలి, సూర్యరశ్మి మొదలైనవి.

దేశంలో వాణిజ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు, ముడిచమురు, అణుశక్తి, సహజవాయువు, జలవిద్యుత్తును వినియోగిస్తున్నారు. నేడు సౌరశక్తి, పవనశక్తి, సముద్ర తరంగాల శక్తి, జీవశక్తి (బయోఎనర్జీ) ఉత్పత్తి, వాడకమూ పెరిగింది.



రావత్‌భటాలోని రాజస్థాన్ అటామిక్ పవర్ ప్రాజెక్ట్ (ఆర్‌ఏపీపీ)

సంప్రదాయ ఇంధన వనరులు

బొగ్గు: ఇంధన వనరుల్లో ప్రధానమైంది. దేశంలో జరిగే విద్యుత్తు ఉత్పత్తిలో 50% పైగా బొగ్గు ద్వారానే జరుగుతోంది. ప్రపంచంలో అధిక బొగ్గు నిల్వలున్న దేశాల్లో భారత్ 5వ స్థానంలో (2023-24 - 378.21 బి.టన్నులు) ఉంది. (మొదటి నాలుగు స్థానాల్లో అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, చైనా ఉన్నాయి.) ప్రపంచంలో బొగ్గు ఉత్పత్తి దేశాల్లో భారత్‌ది రెండో స్థానం (2023-24- 997.25 మిలియన్ టన్నులు). (మొదటి స్థానంలో చైనా, మూడో స్థానంలో ఇండొనేసియా ఉన్నాయి.) బొగ్గును 'నల్లబంగారం' అంటారు. దేశంలో బొగ్గు నిక్షేపాలు రెండు రకాలు.

గోండ్వానా రకం నిక్షేపాలు: ఇవి కార్బోనిఫెరస్ యుగంలో ఏర్పడ్డాయి. మహానది, సోన్, నర్మద, దామోదర్ నదీ లోయ ప్రాంతాల్లో; తెలంగాణ, ఏపీలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్నాయి. దేశంలోని మొత్తం బొగ్గులో 98%ఈ రకమే. నాణ్యమైన ఆంథ్రసైట్, బిట్యుమినస్ రకానికి చెందింది.

టెర్షియరీ రకం: ఇది లిగ్నైట్ రకానికి చెందింది. అస్సాం, శివాలిక్ కొండల వద్ద రాజస్థాన్, కశ్మీర్‌లో; తమిళనాడులోని కడలూర్ జిల్లా నైవేలి, గుజరాత్‌లోని కచ్ ప్రాంతాల్లో లభిస్తుంది. దేశం బొగ్గు నిల్వల్లో ఈ రకం 2% మాత్రమే.

బొగ్గు రకాలు: బొగ్గు ఏర్పడే క్రమంలో ఒత్తిడి, ఉష్ణోగ్రత, కాలం ఆధారంగా పలు రకాలుగా ఏర్పడతాయి. బొగ్గులో మందం, గట్టిదనం, తేమశాతం, బూడిద రకం వేరుగా ఉంటాయి.

ఆంథ్రసైట్: ఇది నాణ్యమైంది, దృఢమైంది. నలుపు రంగులో ఉంటుంది. ఇందులో 80% పైగా కార్బన్ ఉంటుంది. జమ్ము-కశ్మీర్‌లో లభిస్తుంది. మండేటప్పుడు నీలి రంగులో ఉంటుంది.

బిట్యుమినస్ రకం: మెత్తగా ఉంటుంది. దేశంలో అత్యధికంగా ఉన్నది ఇదే. దీనిలో కర్బనం 40-80%, తేమ 15-40% ఉంటుంది. ఝార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్‌ల్లో లభిస్తుంది.

లిగ్నైట్: దీన్ని గోధుమ రంగు బొగ్గు అంటారు. 40%-50% కర్బనం, 35% తేమ ఉంటుంది. నైవేలి (తమిళనాడు), పల్నా (రాజస్థాన్), లక్ష్మీపుర్ (అస్సాం), కారేవా (జమ్ము-కశ్మీర్)ల్లో లభిస్తుంది. తమిళనాడులో లిగ్నైట్ నిక్షేపాలు అధికం.

పీట్: దీనిలో 40-50% కర్బనం ఉంటుంది. బొగ్గు తయారయ్యే క్రమంలో ఏర్పడుతుంది. దీన్ని కాల్చినప్పుడు పొగ, బూడిద ఎక్కువగా వస్తాయి.

> దేశంలో 1774లో అప్పటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ అనుమతితో మొదటిసారిగా పశ్చిమ బెంగాల్‌లోని 'రాణిగంజ్' వద్ద బొగ్గు గనుల తవ్వకం ప్రారంభమైంది.
>
> ప్రపంచ థర్మల్ విద్యుత్తు వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉంది. మొదటి రెండు స్థానాల్లో చైనా, అమెరికా ఉన్నాయి.

ముడిచమురు: పెట్రోలియం అంటే శిలాజ ఇంధనం. దీని నుంచే పెట్రోలు, డీజిల్, కిరోసిన్ లభిస్తాయి. దేశంలో మొదట అస్సాంలోని మాకూమ్ (1867)లో ముడిచమురు గుర్తించగా, అస్సాంలోని డిగ్బాయ్ (1889)లో తొలుత చమురు వెలికితీశారు. సహర్ కటియ, కాంబట్ సింధుశాఖ, బాంబే హై వద్ద పెట్రోలియం నిల్వలను గుర్తించారు. 1956లో భారత్‌లో ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) ఏర్పడింది. నాటి నుంచి దీని పర్యవేక్షణలో చమురు నిల్వల అన్వేషణ, వెలికితీత జరుగుతోంది. 2024, సెప్టెంబరు 19 నాటికి భారత్‌లో గుర్తించిన చమురు నిల్వల అంచనా 410.5 మిలియన్ మెట్రిక్ టన్నులు. 2023-24 నాటికి వెలికితీసిన ముడిచమురు 29.4 మిలియన్ మెట్రిక్ టన్నులు.

> ఒక బారెల్ ముడిచమురు నుంచి 42% పెట్రోలు, 22% డీజిల్, 9% జెట్ ఇంధనం, 5% కిరోసిన్, 4% ఎల్‌పీజీ, 18% ఇతర పదార్థాలు వస్తాయి.
>
> ప్రపంచ పెట్రోలు వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో అమెరికా, రెండో స్థానంలో చైనా ఉన్నాయి.

సహజ వాయువు: భారత్‌లో సహజవాయువు పరిశ్రమ 1960ల్లో అస్సాంలోని డిగ్బాయ్, మహారాష్ట్రలోని ముంబయి హై ఫీల్డ్‌లో ప్రారంభమైంది. 2020-21 లెక్కల ప్రకారం దేశంలో మొత్తం సహజవాయువు నిల్వలు 1,372.62 బి.క్యూబిక్ మీటర్లు. మొత్తం నిక్షేపాల్లో సముద్ర తీరప్రాంతాల్లో ఎక్కువగా ఉండగా, పశ్చిమ తీరంలో 23.7%, తూర్పు తీరప్రాంతాల్లో 41%గా ఉంది. దేశంలో ఉత్పత్తి అయ్యేమొత్తం సహజవాయువులో 75% ఓఎన్‌జీసీ ఉత్పత్తి చేస్తుంది.

అణుశక్తి: అణుశక్తికి కావాల్సినవి యురేనియం, థోరియం నిల్వలు. దేశంలో కేరళ, తమిళనాడు రాష్ట్రాల తీరప్రాంతంలో ఇల్మినైట్, మోనోజైట్ ఖనిజాలు లభిస్తాయి. ఇల్మినైట్ నుంచి టిటానియం, మోనోజైట్ నుంచి థోరియం వస్తాయి. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను 1967లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో 6,780 మెగావాట్ల సామర్థ్యంతో 7 వేర్వేరు కేంద్రాల్లో మొత్తం 24 అణువిద్యుత్తు రియాక్టర్లు పనిచేస్తున్నాయి. 1972లో రాజస్థాన్‌లోని కోటా సమీపంలో రెండో అణువిద్యుత్తు కేంద్రాన్ని రావత్‌భటాలో స్థాపించారు.




రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



> రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

RAMOJI FILM CITY

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

మనసు పెడితే మణిహారమే

అభివృద్ధికి దూరంగా అంతర్వేది బీచ్

న్యూస్‌టుడే, అంతర్వేది, రాజోలు

తీర ప్రాంతాలను పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. జిల్లాలోని సఖినేటిపల్లి మండలం అంతర్వేది నుంచి ఐ.పోలవరం భైరవపాలెం వరకు 93కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. ఈ తీరంలో అంతర్వేది, చింతలమోరి, ఓడలరేవు, సిర్రాయానం, వాసాలతిప్పలలో ఉన్న బీచ్‌లు పర్యాటకులను ఆహ్లాద పరుస్తుంటాయి. వీటిని పర్యాటకశాఖ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.



అంతర్వేది బీచ్‌వద్ద పర్యాటకుల సందడి

ఆహ్లాదం.. ఆధ్యాత్మికత

జిల్లాలో అంతర్వేది ఆలయ ప్రాంతం బీచ్‌తోపాటు, భక్తులు, పర్యాటకుల మనసును పరవశింప చేసే లక్ష్మీనరసింహస్వామి, శ్రీపార్వతీనీలకంఠేశ్వరుడు, ఆంజనేయస్వామి, గుర్రాలక్క అమ్మవారు, వశిష్ఠ దేవాలయాల కూడలి. వీటన్నింటితో కలబోసి ఆధ్యాత్మికంగా పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్న ప్రదేశం. అయితే ఇక్కడ సరైన సౌకర్యాలు లేవు.

ప్రశాంతతకు నిలయం

అంతర్వేది తీరం ప్రశాంతతకు నిలయం. ఆహ్లాదకర ప్రదేశాలకు పెట్టింది పేరు. ఇక్కడకు వచ్చే పర్యాటకులకు చల్లటిగాలులు. ఇసుకతెన్నెలు. ఎగిసిపడే కెరటాలు పలకరిస్తాయి. గోదావరి పరవళ్లు తొక్కుతూ ప్రవహించి సముద్రంలో కలిసే సాగర సంగమం, లైట్‌హౌస్, బోటు షికారు, తీరంలో పరుగులు తీస్తూ తిరిగే ఎర్రపీతలు, జలపుష్పాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. 2014-19లో అధికారంలో ఉన్న తెదేపా ప్రభుత్వం రూ.25లక్షలతో సముద్రం చెంత జమ్ముగడ్డి గుడిసెలు, మరుగుదొడ్లు నిర్మించింది. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం పర్యాటకంపై దృష్టి పెట్టకపోవడంతో ఆ గుడిసెలు పూర్తిగా శిథిలమై పాడైపోయాయి. ఈ బీచ్‌లో విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, చిన్నారులు ఆడుకోవడానికి పార్కులు, బీచ్(స్నానాల రేవు) నుంచి సాగర సంగమం వరకు బీచ్‌రోడ్డు నిర్మిస్తే సందర్శకులకు సౌకర్యవంతంగా ఉంటుంది. పర్యాటకుల సంఖ్య మరింత పెరిగి స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

> **పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా..!**
>
> అంతర్వేదిని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలను తయారు చేసుకున్నా. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సంస్థ అధికారులతో చర్చించి అభివృద్ధికి కావాల్సిన ప్రదేశాలను గుర్తించాం. టూరిజం నుంచి భవనాలు నిర్మించడానికి కృషి చేస్తా.
>
> - దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే, రాజోలు

వరద బాధితులకు రూ.లక్ష వితరణ

ఐ.పోలవరం: విజయవాడ వరద బాధితులకు లయన్స్‌క్లబ్ అమలాపురం, లయన్స్‌క్లబ్ వశిష్ఠ, లయన్స్‌క్లబ్ కోనసీమల సంయుక్త ఆధ్వర్యంలో రూ.లక్ష చెక్కును జిల్లా గవర్నర్ లయన్ ఈశ్వరకుమార్‌కు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు శనివారం అందజేశారు. ఎలాంటి విపత్తులైనా సాయం అందించడంతో తమ క్లబ్ ముందుంటుందని లీడర్ లయన్ ముదునూరి శ్రీరామరాజు పేర్కొన్నారు. సేవలను బుచ్చిబాబు కొనియాడారు. బాదం బాలకృష్ణ, పి.ఉమామహేశ్వరావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఆర్డీవోగా మాధవి బాధ్యతలు




అమలాపురం పట్టణం: అమలాపురం ఆర్డీవోగా కొత్త మాధవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కడప జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన కేశవర్ధనరెడ్డి కనిగిరి ఆర్డీవోగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఆమెను అభినందించారు.

కలెక్టరేట్‌లో ఉద్యోగ మేళా

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: వికాస సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అక్టోబరు ఒకటో తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ మేళాలో గూగుల్ పే, ఇండో ఎంఐఎం రేణిగుంటలో టెక్నీషియన్ల నియామకానికి ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు వికాస సంస్థ ప్రతినిధి రమేష్ తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోటిపల్లి ఈవోగా భీమశంకరం



పండితాశీస్సులు అందుకుంటున్న ఈవో భీమశంకరం

పామర్రు, న్యూస్‌టుడే: ప్రముఖ శైవ క్షేత్రం కోటిపల్లి ఛాయా సోమేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా జె.భీమశంకరం శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. పండితులు ఆశీస్సులు అందజేశారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం తగిన చర్యలు చేపడతానని ఆయన అన్నారు. శివల గ్రూప్ దేవాలయాలకు కూడా ఈయన ఈవోగా అదనపు బాధ్యతలు చేపట్టారు. పామర్రు, అముజూరు, ఎర్రపోతవరం గ్రూప్ దేవాలయాలకు ఈవోగా వాసంశెట్టి శ్రీనివాస్, అముజూరు జేఏ మట్టపర్తి శ్రీనివాసు మండపేట నాళం వారి సత్రం, ఎల్.సి.హెచ్ సన్యాసి నాయుడు కోటిపల్లి మాన్సాస్ ట్రస్టు రెవెన్యూ అధికారిగా శనివారం బాధ్యతలు స్వీకరించారు.

వేగవంతంగా జాతీయ రహదారుల నిర్మాణం

అమలాపురం కలెక్టరేట్: వివిధ ప్రాంతాల అభివృద్ధికి జాతీయ రహదారులు ఎంతగానో తోడ్పడతాయని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. శనివారం సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రహదారుల విస్తరణకు యజమానులు సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి భూములివ్వాలన్నారు. పాశర్లపూడి-దిండి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులకు సంబంధించి అభ్యంతరాలు, పెండింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. నష్ట పరిహారం పెంచాలని బాధితులు కోరుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారులతో సంప్రదించి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో పనులు వేగవంతం చేసి జాతీయ రహదారులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సమావేశంలో జేసీ నిశాంతి, ర.భ.శాఖ ఈఈ రాము, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటినుంచి గోదావరి లంకల్లో 'ఆపరేషన్ చిరుత'

వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం): చిరుత పులి జాడ కోసం గోదావరి లంకల్లో ఆదివారం నుంచి నాలుగు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు కోనసీమ జిల్లా అటవీఅధికారి(డీఎఫ్‌వో) ప్రసాదరావు తెలిపారు. శనివారం రాజమహేంద్రవరంలోని అటవీశాఖ అతిథిగృహం వద్ద విలేకర్లతో ఆయన మాట్లాడారు. రెండు రోజులుగా చిరుత పులి ఆనవాళ్లు ఎక్కడా దొరకలేదన్నారు. వర్షం కారణంగా పాదముద్రలు నమోదు కావట్లేదన్నారు. నాలుగు బోన్లు, 40 ట్రాప్ కెమెరాలు, నాలుగు సోలర్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి 10 బృందాలతో గాలిస్తున్నామన్నారు. మత్తు ఇంజక్షన్ షూట్ చేసేందుకు బృందం సిద్ధంగా ఉందన్నారు. ఎటువంటి లోపం లేకుండా చిరుతను పట్టుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. బుర్రిలంకలోని నర్సరీలు, పరిసరాల్లో, దివాన్‌చెరువు రిజర్వు అటవీప్రాంతాల్లో అమర్చిన ట్రాప్ కెమెరాలు, సీసీకెమెరాలు పరిశీలించగా చిరుత కదలికలు కనిపించలేదన్నారు. బుర్రిలంక సమీపంలోని గోదావరి లంకల్లో జింకలు ఉంటాయని, వాటి కోసం అటువైపు వెళ్లే అవకాశం ఉండటంతో గోదావరి లంకల్లో నాలుగు బృందాలతో ఆపరేషన్ మొదలు పెడుతున్నట్లు తెలిపారు. బుర్రిలంక సమీపంలోని గోదావరి లంక మొదలుకొని గాలింపులు, ట్రాపింగ్ చర్యలు చేపడుతున్నామన్నారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తున్నట్లు చెప్పారు. చిరుత పులి విషయంలో వదంతులు ఎక్కువగా వస్తున్నాయని, అసత్యాలు ప్రచారం చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దని విజ్ఞప్తి చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎఫ్‌వో ప్రసాదరావు

గరికపాటి ఆధ్యాత్మిక ప్రవచనం



అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: నిరంతరం భగవన్నామస్మరణ వల్ల ఎలాంటి ఆపద దరిచేరదని ప్రముఖ ప్రవచనకర్త పద్మశ్రీ గరికపాటి నరసింహారావు సూచించారు. అమలాపురం పట్టణంలోని కె.అగ్రహారం జానకీరామమర్స్ మందిరంలో నరసింహారావు ప్రవచనం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఆనందధార్మిక సంస్థల నిర్వాహకులు అయ్యల సోమయాజుల బ్రహ్మానందం ఆధ్వర్యంలో అనేక మంది హిందూ ధార్మిక బంధువులు హాజరయ్యారు. శ్రీమద్భాగవత అంతర్గతమైన నవమ స్కంధములోని అంబరీషోపాఖ్యానం, ఏకాదశి వ్రతమహాత్యాలపై బోధించారు.

వైకాపా ఎమ్మెల్సీపై దళిత సంఘాల ఆగ్రహం



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు ఫిర్యాదు ఇస్తున్న దళిత ఐక్యవేదిక సభ్యులు

అమలాపురం కలెక్టరేట్: వైకాపా ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావుపై దళిత ఐక్యవేదిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై తీర్పు ఇచ్చిందని తప్పుడు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పెట్టడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక బాధ్యతాయుత పదవిలో ఉండి కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబూరావు, కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, గెడ్డం సురేష్‌బాబు, రేవు తిరుపతిరావు, పొలమూరి మోహన్‌బాబు పాల్గొన్నారు.

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

విజయబేతాళ వాహన మహోత్సవ పనులకు శ్రీకారం

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేటలో దసరా పండుగను పురస్కరించుకుని శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే విజయబేతాళస్వామి వాహన మహోత్సవ పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. స్థానిక బేతాళస్వామి ఆలయం వద్ద కమిటీ సభ్యులు, గ్రామస్థులు పందిరిరాట ముహూర్తం చేశారు. వచ్చే నెల 16న అంబాజీపేటలో 13 శెట్టిబలిజపాలెంలకు చెందిన ప్రజలు ఈ వాహన మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. సంఘం అధ్యక్షుడు దొమ్మేటి వెంకట రామారావు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ శీలం సత్యఅర్జునమోహన రావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మట్టపర్తి సోమేశ్వరరావు, రమేష్, శ్రీవెంకటేశ్వరరావు, కుడిపూడి సూర్య, విత్తనాల ఇంద్రశేఖర్, మట్టపర్తి బాలాజీ, సత్తిబాబు, ప్రకాష్, దొమ్మేటి సాయికృష్ణ, జోగి మధు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.


ఉత్సవానికి పందిరి రాట పనుల్లో కమిటీ సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

మంచినీటి పైపులైనుకు మరమ్మతులు

మలికిపురం: మలికిపురం ముసుగుతోట ప్రాంతంలో లీకేజీకి గురవుతున్న మంచినీటి పైపులైనుకు పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేసి పైపులైనును సరి చేశారు. పైపులైను దెబ్బతిని తాగునీరు రాక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను స్థానిక సర్పంచి గెడ్డం రాజ్యలక్ష్మి, కార్యదర్శి బి.శ్రీహరి దృష్టికి తీసుకురాగా స్పందించిన వారు పంచాయతీ సిబ్బందితో మరమ్మతులు చేయించారు.



మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

సమీకృత సస్యరక్షణపై అవగాహన

రాజోలు: వరిపంటపై ఆశించే ప్రధాన తెగుళ్లు, పురుగులపై సమీకృత సస్యరక్షణ చర్యల గురించి జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్ చెన్నడంలోని రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఆ సమస్యలు తలెత్తినప్పుడు చేపట్టే చర్యలను వివరించారు. ఏడీఏ రామ్మోహన్, ఏఓ మధుకుమార్, వీఏఏ బాలాజీ, సర్పంచి బడుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ జిల్లా పోటీలకు ఎంపిక

మామిడికుదురు: 68వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో భాగంగా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు మామిడికుదురు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు వివిధ విభాగాల్లో నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి ఎంపికయ్యారు. అండర్-17 వాలీబాల్ పోటీలకు అయిదుగురు, ఖోఖో పోటీలకు ముగ్గురు, కబడ్డీ పోటీలకు ముగ్గురు, చదరంగం పోటీలకు ఒకరు ఎంపికయ్యారని మండల క్రీడా సమన్వయకర్త మట్టా శ్రీధర్ శనివారం తెలిపారు.


ఎంపికైన విద్యార్థులతో సమన్వయకర్త శ్రీధర్

నాణ్యమైన బోధనపై దృష్టి

■ పాఠశాలల్లో శుభ్రత యాజమాన్య కమిటీలదే ■ ఉపాధ్యాయులపై తగ్గనున్న పనిభారం

అయినవిల్లి, రాజోలు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పాలనలో అనేక సంస్కరణలు తీసుకొస్తోంది. దీనిలో భాగంగా పాఠశాలల నిర్వహణ, అభివృద్ధి, శుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి తొలుత కమిటీల ఎన్నికలను పూర్తి చేసింది. పాఠశాల యాజమాన్య (ఎస్ఎంసీ) కమిటీ సభ్యులు, సచివాలయ సంక్షేమ సహాయకులు పాఠశాలల్లోని మరుగుదొడ్ల చిత్రాలు తీయాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు సూచించారు. వీరు తీసిన చిత్రాలను ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. గత వైకాపా ప్రభుత్వ సమయంలో ఉపాధ్యాయులపై పలు రకాల యాప్‌ల నిర్వహణభారం మోపింది. దీంతో విలువైన సమయమంతా ఫొటోలు తీయడం, వివరాలు నమోదుచేయడం, పరిశీలించడం వంటి పనులకు వెచ్చించాల్సి వచ్చేది. విద్యార్థులకు సకాలంలో నాణ్యమైన బోధన అందకుండా విద్యావిధానం గాడి తప్పింది.

■ సభ్యులకు ఐడీ, పాస్‌వర్డ్‌లు: యాజమాన్య కమిటీ సభ్యులు ప్రతి బుధ, శుక్ర వారాల్లో పాఠశాలలకు వచ్చి మరుగుదొడ్ల చిత్రాలు తీయాలని ఆదేశాలు వచ్చాయి. వారికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య(ఐడీ), పాస్‌వర్డ్‌లు కేటాయించారు. ఆ సంఖ్యతో ఐఎంఎంఎస్ యాప్ తెరిచి వారు తీసిన చిత్రాలను అప్‌లోడ్ చేయాలి. దీనిపై కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా సంక్షేమ సహాయకులు సోమ, గురువారాల్లో చిత్రాలు తీయాల్సి ఉంది.

నియోజకవర్గంలో ఇలా..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
అయినవిల్లి	71	4325
పి.గన్నవరం	84	5278
అంబాజీపేట	64	3610
మామిడికుదురు	71	3801
రాజోలు	69	4134
మలికిపురం	78	4128
సఖినేటిపల్లి	78	3974

■ ప్రత్యేక శ్రద్ధ వహిస్తారనే: విద్యార్థులు ఉపయోగించే మరుగుదొడ్లు, పరిశుభ్రంగా ఉండేలా చేయడంలో వారి తల్లిదండ్రుల సూచనలు కీలకం. పిల్లల్ని ఇంట్లో మాదిరిగానే పాఠశాలల్లోనూ శుభ్రంగా వినియోగించేలా చూడడం వీరి విధి. అందుకే నిర్వహణ పనుల్లో భాగస్వామ్యులను చేశారు. ఎక్కడైనా అపరిశుభ్రంగా ఉన్న, మరమ్మతులకు నోచుకోకున్నా తక్షణం ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లవచ్చు.


ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు

తప్పని సరిగా నమోదు చేయాలి

యాజమాన్య కమిటీలు పాఠశాలల అభివృద్ధికి పరిశుభ్రతకు కృషి చేయాలి. ఐఎంఎంఎస్ యాప్‌లో వారంలో రెండుసార్లు యాజమాన్య కమిటీ సభ్యులు, మరో రెండుసార్లు సంక్షేమ కార్యదర్శులు చిత్రాలు తీసి అప్‌లోడ్ చేయాలి. దీనిద్వారా పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం నెలకొంటుంది

-జి.సూర్యప్రకాశరావు, డీవైఈవో

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

రాజోలు, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ మోసాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని రాజోలు భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజర్(ఏడీబీ) ప్రసాద్ అన్నారు. స్థానిక బ్యాంక్ ఆవరణలో శనివారం ముఖ్య ఖాతాదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. తమ వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, కె.రాజబాబు, పి.మోహన్, జి.శ్రీనివాస్, ఎన్.బాలకృష్ణ, శశి పాల్గొన్నారు.

ఆత్రేయపురం సబ్ రిజిస్ట్రార్‌గా రత్నకుమార్



ఆత్రేయపురం: ఆత్రేయపురం సబ్ రిజిస్ట్రార్‌గా ఎం.రత్నకుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ జయరాజు కృష్ణా జిల్లా కానుమోలు బదిలీ అయ్యారు.

ఇరిగేషన్ ఏఈగా వెన్నా



ఆత్రేయపురం జలవనరుల శాఖ ఏఈగా వెన్నా మాధవ సాయి ప్రసన్న నియమితులయ్యారు. ఆయన శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఇక్కడ పనిచేసిన ఏఈ పిల్లా సత్యనారాయణ రాజమహేంద్రవరం సబ్ డివిజన్‌కు బదిలీ అయ్యారు.


అప్పనపల్లి పాదయాత్రగా సిద్ధమవుతున్న కూటమి శ్రేణులు


మామిడికుదురు కూటమి నాయకులతో ఎమ్మెల్యే సత్యనారాయణ

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పాదయాత్ర

మామిడికుదురు, రాజోలు, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ నెయ్యి వివాదంలో డిప్యూటీ సీఎం పవన్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు శనివారం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయం వరకు పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొని లడ్డూ ప్రసాదం అపవిత్రానికి కారకులైన వారిపై చట్టపరంగా చర్యలు చేపట్టాలని కోరారు.

అయినవిల్లి: డిప్యూటీ సీఎం పవన్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా శనివారం మండలంలోని నల్లచెరువు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గ్రామానికి చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు దీక్షచేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దీక్షలో పాల్గొన్నారు. సర్పంచ్ గుండుమోగుల వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు వర్రే శేషు, వర్రే శ్రీనివారావు, జి.భూషణం, రావూరి సూర్య తదితరులు పాల్గొన్నారు.

నవయుగ కవి చక్రవర్తి జాషువా

కొత్తపేట: నవయుగ కవి చక్రవర్తి జాషువా అని విశ్వకవి వేమన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కేపీ రాజు అన్నారు. శనివారం స్థానిక కళాశాల, వానపల్లి గ్రామ పంచాయతీలోని జాషువా జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

రాజోలు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాషువా జయంతిని తెలుగు విభాగంవారు నిర్వహించారు. ప్రిన్సిపల్ సాయిబాబు అధ్యక్షత వహించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

అంబాజీపేట: అంబాజీపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో కవి గుర్రం జాషువ జయంతిని శనివారం నిర్వహించారు.

రావులపాలెం పట్టణం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాషువా జయంతిని తెలుగు అధ్యాపకుల ఆధ్వర్యంలో నిర్వహించారు.


కొత్తపేట: కళాశాలలో జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్, విద్యార్థులు


రావులపాలెంలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

లడ్డూ వివాదంపై సీబీఐ దర్యాప్తు చేయాలి

మామిడికుదురు, రాజోలు, న్యూస్‌టుడే: లడ్డూ వివాదంపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పి.గన్నవరం: కల్తీ నెయ్యి సమస్యపై సమగ్ర దర్యాప్తు చేయించాలని ఉమ్మడి తూ.గో. జిల్లా పరిషత్తు ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి తదితరులు డిమాండ్ చేశారు.

ఆత్రేయపురం: సీఎం చంద్రబాబు లడ్డూపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు జరిపించాలని వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన అన్నారు.

అబ్కారీశాఖ సీఐల బదిలీలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో అబ్కారీశాఖ సీఐల బదిలీలకు ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అమలాపురం స్టేషన్‌కు వీటీవీవీ సత్యనారాయణ, ఆలమూరుకు ఐడీ నాగేశ్వరరావు, ముమ్మిడివరానికి ఈ.స్వరాజ్యలక్ష్మి, కొత్తపేటకు కోటిపల్లి కాత్యాయని, రాజోలుకు కె.వీరబాబు, రామచంద్రపురానికి పి.శ్రీనివాస్ వస్తున్నారు.

గుంతల రోడ్డుపై ఇక్కట్లు..



రాజోలు: ములికిపల్లి కూడలినుంచి గొల్లపాలెం బ్రిడ్జి వరకు 6 కిలోమీటర్ల మేర ఉన్న పంచాయతీరాజ్ రహదారి అధ్వానంగా తయారైంది. పెద్ద పెద్ద గోతులుపడి రాళ్లు పైకి లేచాయి. వర్షాలకు గోతుల్లో నీరుచేరడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రోడ్డు ద్వారా నిత్యం ఐదు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.60లక్షలు మంజూరైనా బిల్లులు రావడం లేదన్న కారణంగా పనులు చేసేందుకు గుత్తేదారులు ఎవ్వరూ ముందుకురాలేదు. దీనిపై పంచాయతీరాజ్ ప్రాజెక్ట్స్ ఏఈ చిన్నంరాజును వివరణ కోరగా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మళ్లీ టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు.

గర్భిణులకు ఆశీర్వచనాలు


విశ్వేశ్వరాయపురంలో సీమంతాలు

మలికిపురం: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ రాజోలు సీడీపీవో వైకేడీ రమాదేవి అన్నారు. విశ్వేశ్వరాయపురంలో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సర్పంచి చెల్లుబోయిన హెలీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రసన్నరాణి పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గర్భిణులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతాలను నిర్వహించారు. సీడీపీవో రమాదేవి, ఎంపీపీ వీరా మల్లిబాబు, సీడీపీవో, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జె.రోజా, సూపర్‌వైజర్ విజయభారతి, ఎంపీటీసీ వెంకాయమ్మ పాల్గొన్నారు.

కొత్తపేట: వానపల్లి, వాడపాలెం గ్రామాల్లో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. వానపల్లి సర్పంచ్ పల్లిభీమారావు, సెక్టార్ సూపర్‌వైజర్ నాగమణి, వాడపాలెం సర్పంచి, ఎంపీటీసీలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళులు..

మామిడికుదురు: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంత్యుత్సవం సందర్భంగా నగరం ఎంపీపీ పాఠశాలలో ఆయన చిత్రపటానికి శనివారం పూల మాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు జకీరున్నాసాబేగం, ఎం.విజయదుర్గారావు పాల్గొన్నారు.

సహకార రుణాలు సకాలంలో చెల్లించాలి



మహాజన సభలో మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌ఛార్జి

అంబాజీపేట: రైతులు తాము తీసుకున్న సహకార రుణాలను సకాలంలో చెల్లించాలని అంబాజీపేట సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి ఐ.శ్రీనివాసు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక సహకార సంఘ సమావేశం సీఈవో కుంపట్ల అయ్యప్ప నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.

మలికిపురం: సొసైటీలకు తక్షణం ఎన్నికలు జరిపించాలని ప్రభుత్వాన్ని కోరుతూ రామరాజులంక పీఏసీ సొసైటీ మహాజన సభ తీర్మానించింది. సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి జి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శనివారం పలు అంశాలను చర్చించారు.

ప్రారంభించారు... ఆపై మరిచారు



సార్వత్రిక ఎన్నికలకు ముందు హడావుడిగా మాచవరం-4 సచివాలయం పక్కన నిర్మించిన రైతు భరోసా కేంద్రం (రైతు సేవా కేంద్రం)ను అప్పటి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అసంపూర్తిగా కనీసం తలుపులు కూడాలేని ఈ భవనాన్ని ఎన్నికల కోడ్ వచ్చేస్తుందని హడావుడిగా ప్రారంభించారు. సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఇప్పటికీ ఆ భవనం అలాగే ఉంది. దీనిపై వ్యవసాయాధికారి డి.విజయకుమార్ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో పనులు జరగలేదన్నారు. ఇంజినీరింగ్ అధికారులు అన్ని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తే రైతు సేవా కేంద్రంగా వినియోగించుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట.

ఎమ్మెల్యేకు సచివాలయ ఉద్యోగుల వినతి

మలికిపురం: సచివాలయ ఉద్యోగులుగా తమ ఆత్మగౌరవాన్ని నిలపాలని రాజోలు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. విశ్వేశ్వరాయపురంలోని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నివాసంలో ఆయనను కలిసిన ఉద్యోగులు వినతిపత్రం ఇచ్చారు. తమను దిగువ స్థాయి ఉద్యోగులుగా చూస్తూ తమవి కాని పనులు అప్పగించడం సరికాదని అన్నారు. సమస్యలన్నింటినీ పరిశీలించి పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెస్తానని హామీ ఇచ్చారు.

తరగతి నిర్వహణకు చర్యలు తీసుకోవాలని..

మలికిపురం: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సుధాకర్ మలికిపురంలోని డిగ్రీ కళాశాల తరగతుల నిర్వహణ విషయంలో చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విజ్ఞప్తి చేశారు. పాలకవర్గం జీతాలు ఇవ్వకపోవడంతో అధ్యాపకులు ఆందోళన చేపట్టారని, అధ్యాపకులు లేక తరగతులు జరగడం లేదని వినతిపత్రంలో పేర్కొని సుధాకర్‌కు తమ కార్యాలయం నుంచి అందించారు. రిజిస్ట్రార్ కళాశాలకు వచ్చి తరగతుల నిర్వహణ, పాఠాల బోధన విషయంలో తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి



అంబాజీపేట ప్రదర్శనలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని పరిరక్షించాలని కోరుతూ.. కలియుగదైవం తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసి, అపవిత్రం చేసిన గత వైకాపా ప్రభుత్వంలోని బాధ్యులైన పాలకులు... అందుకు సహకరించిన అధికారులు, ఉద్యోగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అంబాజీపేటలో హిందువులు, కూటమిశ్రేణులు శనివారం భారీ ప్రదర్శన జరిపారు. తొలుత కొర్లపాటివారిపాలెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి అంబాజీపేట పెద్దవీధిలో ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయం వరకు ప్రదర్శన సాగింది. కార్యక్రమంలో కూటమినాయకులు దాసరి వీరవెంకటసత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొర్లపాటి గోపి, బొంతు పెదబాబు, మహిపాల తాతాజీ, రవణం రాము తదితరులు పాల్గొన్నారు.

తీరంలో తాగునీటి సమస్య తీరుస్తాం


తాగునీటి ప్రాజెక్టు చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: సఖినేటిపల్లి మండలంలోని తీర గ్రామాల తాగునీటి సమస్య తీరుస్తామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మండలంలోని అంతర్వేది దేవస్థానం, అంతర్వేదికర, గొంది, పల్లిపాలెంలోని 35వేల మంది ప్రజల దాహార్తి తీర్చడానికి రూ.17.33 కోట్లతో దేవస్థానం గ్రామంలో నిర్మిస్తున్న తాగునీటి ప్రాజెక్టును (నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంపులు, చెరువు) ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. నత్తనడకగా జరుగుతున్న ఈ ప్రాజెక్టు నాలుగు నెలల్లో పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజన్, గుత్తేదారుడు మధుకుమార్‌కు తెలిపారు. వచ్చే ఏడాది కల్యాణోత్సవాలకు సిద్ధం చేయాలని కోరారు. జనసేన సమన్వయ కర్త పెదకాపు, ఎంపీపీ మల్లిబాబు, ఎంపీటీసీ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శిరీష తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో తయారు చేస్తున్న లడ్డూ, అన్నప్రసాద నాణ్యతలను అనంతరం ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రసాదం రుచిలో ఫిర్యాదులు, నాణ్యత తగ్గినా చర్యలు తప్పవని సూపరింటెండెంట్ విజయసారధి, సిబ్బందికి తెలిపారు.

కళాశాలలో రక్తదాన శిబిరం

మామిడికుదురు, న్యూస్‌టుడే: స్థానిక దీప్తి డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన శిబిరంలో ఎన్.ఎస్.ఎస్.కు చెందిన 50 మంది విద్యార్థులు, పలువురు అధ్యాపకులు రక్తదానం చేశారు. అమలాపురం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలోని రక్త నిల్వ కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డీవీవీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



శిబిరంలో విద్యార్థులు

తండ్రి రుణం తీర్చుకున్న కుమార్తె



కొడుకు లేని ఆ తండ్రికి కూతురే అంత్యక్రియలు నిర్వహించి రుణం తీర్చుకుంది. ఆలమూరులోని గన్ని అమ్మిరాజు(64) గురువారం మృతి చెందారు. కుమారులు లేకపోవడంతో అమెరికాలో ఉంటున్న ఏకైక కుమార్తె సీతామాలక్ష్మి తండ్రి మరణవార్తతో హుటాహుటిన స్వదేశానికి బయలుదేరారు. శనివారం ఇక్కడికి చేరుకున్న ఆమె స్థానిక హిందూ శ్మశాన వాటికలో తండ్రికి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించి తలకొరివి పెట్టారు. ఈ క్రతువు అక్కడి స్థానికులను ఆశ్చర్యపరిచింది. - న్యూస్‌టుడే, ఆలమూరు

కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి

అంబాజీపేట, న్యూస్‌టుడే


అంబాజీపేట మార్కెట్‌లోని ఉల్లిపాయలు

ఉల్లి ధర మార్కెట్‌లో నిలకడగా ఉంది. ధర తగ్గకపోవడంతో వినియోగదారుల కంట నీరు రప్పిస్తోంది. నెల రోజులుగా కిలో ఉల్లి రూ.60లు దాటి ఉందని.. దీంతో కొనాలంటే భారంగా మారిందని కొనుగోలు దారులు వాపోతున్నారు. ఈ ప్రభావం సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పడింది. నెల రోజుల కిందట కిలో ధర రూ.20లోపు ఉండేది. ఇప్పుడు రూ.60లు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గట్టుగా ఉల్లిపాయల దిగుమతులు లేవు. ఈ నేపథ్యంలో ఉల్లి ధర పెరుగుతుంది. మే, జూన్ నెలల్లో మహారాష్ట్రలో వర్షాలు ఎక్కువగా రావటంతో ఉల్లిపంట మొత్తం దెబ్బతింది. దీంతో ఉల్లిపాయల దిగుమతులు తగ్గాయి. ధర పెరగటంతో కూరల తయారీకి ఇబ్బందులు తప్పడం లేదని హోటళ్ల నిర్వాహకులు తెలిపారు. ఇటీవల వచ్చిన వరదలతో కూడా ఉల్లిపంట దెబ్బతినటంతో ఉత్పత్తి తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు.

తగ్గించి కొనుక్కొంటున్నాం..



ఉల్లిపాయల ధర తగ్గటంలేదు. గతంలో వారానికి రెండు నుంచి మూడు కిలోలు ఉల్లిపాయలు కొనుగోలు చేసేవాళ్లం. ఇప్పుడు ధర అధికంగా ఉండటంతో అర కిలో నుంచి కిలో మాత్రమే కొనుగోలు చేసుకుంటున్నాం. ధర తగ్గితే బాగుంటుంది.

- గంగాభవానీ. గృహిణి, నందంపూడి

రేబిస్ వ్యాధిపై అవగాహన

మలికిపురం: ప్రాణాంతకమైన కుక్కకాటు ద్వారా వ్యాప్తి చెందే రేబిస్ వ్యాధి గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గుడిమెళ్లంక పశువైద్యాధికారి డి.శివకుమార్ అన్నారు. రేబిస్ దినోత్సవం సందర్భంగా గుడిమెళ్లంక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించి ఆయన మాట్లాడారు. హెచ్ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కొత్తపేట: మందపల్లిలోని మందేశ్వరస్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అభిషేకాలు, ప్రసాదాల ద్వారా రూ.1,61,103లు ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ విజయలక్ష్మి తెలిపారు.

తెదేపా సభ్యత్వ నమోదుపై శ్రద్ధ పెట్టాలి


మాట్లాడుతున్న నామన రాంబాబు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదు పై కార్యకర్తలు, నాయకులు శ్రద్ధ పెట్టాలని ఆ పార్టీ పి.గన్నవరం కన్వీనరు నామన రాంబాబు విజ్ఞప్తి చేశారు. తెదేపా సభ్యత్వ నమోదుపై స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనరు సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్తు కనెక్షన్లు తొలగించండి

మలికిపురం: రాజోలు నియోజకవర్గ పరిధిలో అనుమతులు లేని ఆక్వా చెరువులకు విద్యుత్తు కనెక్షన్లను తక్షణమే తొలగించాలని మానవహక్కుల వేదిక జిల్లా కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు చెవ్వాకుల వెంకటేష్‌లు విద్యుత్తు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కనెక్షన్లు తొలగించడానికి వచ్చిన రైతులను అడ్డగించడం, వారు వెనుతిరగడం సరికాదన్నారు

అన్నదాన కార్యక్రమాలు

యానాం: గణపతి నవరాత్రి వేడుకలు ముగిసిన నేపథ్యంలో శనివారం పాత రాజీవ్‌నగర్‌లోని శ్రీమహ గణపతి, రాజీవ్‌బీచ్ కేవీఆర్‌నగర్, స్థానిక అంబేడ్కర్ విజయ లక్ష్మీగణపతి, ద్రాక్షారామరోడ్డు టార్గెట్‌స్టాండ్ పంచముఖ విజయలక్ష్మీగణపతి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

అమలాపురం పట్టణం: పురపాలిక కార్యాలయం ఎదుట మెప్మా అర్బన్ మార్కెట్‌ను మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు , కనక దుర్గ, దుర్గారావు, లక్ష్మి, సత్యలక్ష్మి, శ్రీనివాస్, ఆర్పీలు పాల్గొన్నారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

సామూహిక సీమంతాలు

ఉప్పలగుప్తం: పోష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు శనివారం నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది పోష్టికాహార ప్రాధాన్యం వివరించారు. సీడీపీవో కుమారి, ఏవో మూర్తి, సర్పంచి చిన్నవ రాజు, సంపదరావు, సత్యకృష్ణ, లీలాకుమారి, రమాదేవి, మహేశ్వరి, బేగం పాల్గొన్నారు.

గ్రామస్థుల చేయూత

ఉప్పలగుప్తం: ఇటీవల గొల్లవిల్లిలో ప్రమాదవశాత్తు మృతిచెందిన గుర్రాల అక్కిరాజు కుటుంబ సభ్యులకు స్థానిక అంబేడ్కర్‌నగర్‌వాసులు ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం రూ. 14,210 నగదును అతని ఇంటివద్ద అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: నడవపల్లిలో తాగునీటి ట్యాంకు లోపల నాచు ఏర్పడింది. దాంతో తాగునీరు కలుషితంగా వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకును శుభ్రం చేసే పనులు చేపట్టాలి. **- స్థానికులు**

పరిష్కారం: సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందిని కేటాయించి ట్యాంకును శుభ్రంగా కడిగించారు. అనంతరం బ్లీచింగ్ వేయించారు.

సమస్య: పల్లంకుర్రు పంచాయతీ పరిధిలోని పోర గ్రామంలో కొన్ని వీధుల్లో దీపాలు సక్రమంగా వెలగడం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి. **- గ్రామస్థులు**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి రామారావుకు తెలుపగా స్పందించారు. సిబ్బందిచే వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

సమస్య: కాశివారితూము ప్రాంతంలో రోడ్డు చెంత చెత్త పేరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. దుర్వాసన భరించలేకున్నాం. అధికారులు సమస్యను పరిష్కరించాలి. **- ఆర్.నరసింహమూర్తి, స్థానికుడు**

సమస్య: బళ్లగేటుసెంటర్ ప్రాంతంలో డ్రెయిన్ పూడిపోవడంతో నీరు ముందుకు వెళ్లక దుర్వాసన వస్తోంది. **- ఎన్.శ్రీనివాసరావు, స్థానికుడు**

పరిష్కారం: నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు తెలిపిన సమస్యలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరాజు దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. వెంటనే సిబ్బందిని పంపి సమస్యలను పరిష్కరించారు.

– న్యూస్‌టుడే, కాట్రేనికోన, ముమ్మిడివరం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: **79811 19595**, ముమ్మిడివరం: **80085 74166**

ఫలమే బలం

ఆదివారం ప్రత్యేకం

అమలాపురం పట్టణానికి చెందిన ఓ మహిళకు ప్లేట్‌లెట్లు పడిపోయాయి. బొప్పాయి, డ్రాగన్, కివీ, దానిమ్మ వంటి పండ్లు తింటూ ఆరోగ్యం మెరుగు పర్చుకున్నారు. ఇదీ పండ్ల ప్రత్యేకత.


మార్పు మొదలైంది..

ఇటీవల చాలామందిలో జంక్‌ఫుడ్‌తోపాటు చిరుతిళ్లు తినడంతో ఆరోగ్యం మందగిస్తుండటంతోపాటు ఆసుపత్రులకు వెళ్లక తప్పడం లేదు. ఇలాంటి సమస్యలు అధిగమించేందుకు క్రమంగా పట్టణంలోపాటు పల్లెజనమూ పండ్లు తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొవిడ్ తరువాత ఆరోగ్యంపై మరింత శ్రద్ధ తీసుకుంటున్న ఈ క్రమంలో ఖర్చుకు వెనుకాడడం లేదు. ప్రజల అభిరుచుల మేరకు అమలాపురం పట్టణం, సమీప మండల కేంద్రాల్లో డ్రైఫ్రూట్స్ తదితర దుకాణాలు కూడా పెరిగిపోతున్నాయి. ఇది పరోక్షంగా మరికొందరికి ఉపాధిగా మారుతోంది.

– న్యూస్‌టుడే, అమలాపురంగ్రామీణం

ఆరోగ్యం రిమ్‌'జిమ్'..

వ్యాయామం దినచర్యగా మార్చుకోవాల్సిందే నన్న ప్రస్తుత అవసరాలకు తగినట్లు జిల్లా కేంద్రంలో జిమ్‌లను విస్తరిస్తున్నారు. చాలామంది ఇళ్ల ఆవరణలో వ్యాయామానికి సొంతంగా ఏర్పాట్లు చేసుకుంటే.. మరికొందరు జిమ్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇది వరకు జిమ్‌లలో కేవలం కేలరీలు కరిగించుకునేందుకు తగిన పరికరాలు మాత్రమే ఉండేవి. అధిక సమయం యువత, మహిళలు కసరత్తులు చేస్తుండడంతో.. నీరసించకుండా వారికి కావాల్సిన జ్యూస్‌లు, మొలకెత్తిన పెసలు, సెనగలు, గోధుమ మొలకల రసం తదితరాలను అందుబాటులో ఉంచుతున్నారు. వీటికోసం రోజుకు రూ. 30 వరకు వసూలు చేస్తున్నారు.


అమలాపురంలో దొరికే ఫ్రూట్ సలాడ్


పట్టణంలోని పలు జిమ్‌లలో అందిస్తున్న మొలకలు

పట్టణంలో..
జిమ్‌ల సంఖ్య: 10
రోజువారీగా జిమ్‌కు వచ్చేవారు: సుమారు 600 నుంచి 900
ఇంటివద్ద వ్యాయామం చేసేవారు: 2000 పైగా

ఆహారం.. ఆహార్యంపై..

ఆహార అలవాట్ల విషయంలో మహిళలతోపాటు వృద్ధులు, యువత ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వీరికోసం అమలాపురం పట్టణంలో కొందరు ప్రత్యేకంగా ఫ్రూట్ సలాడ్ రోజుకో రకం డబ్బాల్లో అయిదు కి.మీ. లోపు ఇళ్లకే సరఫరా చేస్తున్నారు. పెద్దది రూ. 99, చిన్న బాక్సు రూ. 79 చొప్పున అమ్ముతున్నారు. కొందరు నెలవారీ చెల్లిస్తున్నారు.

గ్రీన్ టీ తాగుతున్నా..



వ్యాయామం చేసిన తర్వాత గ్రీన్ టీ తాగడంతో కొంత ఉత్సాహానిస్తోంది. జీర్ణశక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడుతుందని, గ్రీన్ టీ రక్తనాళాల్లో కొవ్వును కరిగిస్తుందని నిపుణులు సూచించారు. అందుకే ప్రతి రోజూ జిమ్‌లో వ్యాయామం చేయగానే గ్రీన్ టీ తాగేస్తున్నా.

- ముత్తాబత్తుల రమణ, సాకుర్రు

ట్రెడ్ మిల్‌పై..



ట్రెడ్ మిల్‌పై నడక, పరుగుతో గుండెను పదిలంగా ఉంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అందుకే ప్రతిరోజూ అర గంట సాధన చేస్తున్నా. ఇంటి వద్దనే ఏర్పాటు చేసుకున్నా.. ప్రస్తుతానికి జిమ్‌కే వెళుతున్నా.

- శిరగం నాగేంద్ర, భట్లపాలెం

ఉప్పలగుప్తం ఎస్సైగా రాజేష్

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం ఎస్సైగా సీహెచ్ రాజేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తూ ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో అమలాపురం తాలుకా, ఐ.పోలవరం, ప్రస్తుత అల్లూరి జిల్లా ఎటపాక మండలాల ఎస్సైగా ఆయన విధులు నిర్వర్తించారు.

దరఖాస్తుల ఆహ్వానం

యానాం: యానాం పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో 2024-25 సంవత్సరానికిగాను ఇన్‌ప్లాంట్ ట్రైనింగ్‌కు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పరిపాలనాధికారి మునిస్వామి శనివారం తెలిపారు. అక్టోబరు 21లోపు దరఖాస్తు చేయాలన్నారు. గణాంకశాఖ ఆఫీస్ అసిస్టెంట్, సివిల్, ఆర్కిటెక్చరల్, ఎలక్ట్రికల్, ఫార్మాస్యూటికల్, ఈసీఈ ఇంజినీరింగ్ అసిస్టెంట్, కంప్యూటర్ వెబ్ డిజైనింగ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, క్లినికల్ అసిస్టెంట్ పోస్టులకు శిక్షణ కల్పిస్తామన్నారు.

రేబిస్ ప్రాణాంతకం.. అవుదాం అప్రమత్తం

యానాం, న్యూస్‌టుడే: రేబిస్ వ్యాధి నూరు శాతం ప్రాణాంతకమని, సోకితే చనిపోవడమేనని జిప్‌మెర్ మల్టీ స్పెషాలిటీ కన్సల్టింగ్ యూనిట్ నర్సింగ్ అధికారులు సుభాషిణి, కాజల్‌శర్మ వివరించారు. ప్రపంచ రేబిస్ డే సందర్భంగా శనివారం ఓపీ విభాగానికి వచ్చిన రోగులు, సహాయకులకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లుల ద్వారా సంక్రమించే రేబిస్ విషయంలో ప్రతిఒక్కరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. పెంపుడు జంతువులకు తప్పక టీకా వేయించాలన్నారు. జిప్‌మెర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆనందరాజు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు ఉష, మీనా, శ్రీలక్ష్మి, శ్రీనివాస్, అమ్మాజీ, విఘ్నేశ్వరి, వెంకట్ పాల్గొన్నారు.

ప్రసాదం నెయ్యి కల్తీ దోషులను శిక్షించాలని..


నిరాహార దీక్షలో జనసేన, తెదేపా నాయకులు

అమలాపురం పట్టణం: తిరుమల ప్రసాదం లడ్డూలో నెయ్యి అపవిత్రతపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా రిలే నిరాహార దీక్ష చేశామని జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి చిక్కం భీముడు తెలిపారు. గడియారస్తంభం ప్రాంగణంలో జనసేన నాయకులు శనివారం దీక్ష చేశారు. తెదేపా, భాజపా నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం ఎంపీ హరీష్ వారికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. కౌన్సిలర్లు గండి దేవిహారిక, పిండి అమరావతి, గొలకోటి విజయలక్ష్మి, గండి స్వామి, బుజ్జి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రద్దుచేసిన అంశాలను ఎలా పెట్టారు..

రూ.3.5 కోట్ల ఖర్చుపై నిలదీత


సమావేశంలో ప్రశ్నిస్తున్న జనసేన, తెదేపా, వైకాపా కౌన్సిలర్లు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మురుగు కాలువల్లో రూ. 39 లక్షలతో పూడిక తీత ప్రతిపాదనలను వైకాపా కౌన్సిలర్లు వాయిదా వేసినా.. ఆమోదించడాన్ని నిరసిస్తూ తెదేపా, జనసేన కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. పురపాలిక కార్యాలయంలో ఛైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం శనివారం జరిగింది. అజెండాలో అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. రూ. 3.50 కోట్ల పనులకు గత కమిషనర్ మనోహర్ సంతకం చేయడంపై విచారణకు వైకాపా కౌన్సిలర్లు పట్టుపట్టారు.

'ఈనాడు' కథనంపై చర్చ..

తెదేపా కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి మాట్లాడుతూ భూపయ్య అగ్రహారంలో రోడ్డు నిర్మాణం చేయాలని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం గురించి ప్రస్తావించారు. మంచినీటికి రూ. 3 కోట్లు ఖర్చుపెడుతున్నా, ప్రజలకు సరిగా ఇవ్వలేకున్నామని తెదేపా కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. అధికారులు సమాధానం చెప్పాలని నిలదీశారు. దానికి వైకాపా కౌన్సిలర్ సంసాని నాని స్పందించగా.. అధికారులను ప్రశ్నిస్తుంటే వైకాపా కౌన్సిలర్లు సమాధానం చెప్పడమేంటని తెదేపా, జనసేన కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్, కమిషనర్ పోడియం వద్దకు వెళ్లి నిలదీసినా.. సరైన సమాధానం రాకపోవడంతో సమావేశం నుంచి బయటకు వెళ్లి కాసేపు ఆందోళన చేశారు.

ఇన్నాళ్ల తరువాత చెల్లింపులా..

కరోనా సమయంలో పనులకు సంబంధించి చెల్లింపులు ఇప్పుడేంటని, వివరాలు తెలపాలని వైకాపా కౌన్సిలర్ రాజేష్ ప్రశ్నించారు. ✦ అధికారుల నిర్లక్ష్యంపై వైకాపా కౌన్సిలర్‌లు రుద్రరాజు నానిరాజు, మట్టపర్తి నాగేంద్ర తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఏడిద శ్రీను, పిండి అమరావతి, పడాల శ్రీదేవి, తిక్కా సత్యలక్ష్మి, ఆశెట్టి కనకదుర్గ, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అందుబాటులో ఉంటా..

కోనసీమ ప్రజల కోరికైన రైల్వేలైన్ నిర్మాణం చేస్తానని, రైల్వే టికెట్‌ల విక్రయ కేంద్రాన్ని తీసుకొస్తానని ఎంపీ హరీష్‌మాథుర్ తెలిపారు. అమలాపురం పురపాలిక కార్యాలయంలో ఛైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఆయన శనివారం తొలిసారి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా హాజరయ్యారు. అమలాపురం అభివృద్ధికి తాను అన్నివేళలా అందుబాటులో ఉంటానని ఎంపీ తెలిపారు.

ఉపాధి లక్ష్యం పూర్తి చేయాలి

అల్లవరం: గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు అరికట్టేందుకు రూపొందించిన ఉపాధి హామీ పథకంలో పని దినాల లక్ష్యం పూర్తి చేయాలని డ్వామా పీడీ మధుసూదన్ అధికారులను ఆదేశించారు. శనివారం అల్లవరం ఎంపీడీవో కార్యాలయంలో 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో నిర్వహించిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. గూడాల, డి.రావులపాలెం గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్మాణం పూర్తికాకుండానే బిల్లు మొత్తం చెల్లించినట్లు అధికారులు గుర్తించారు. గూడాల క్షేత్ర సహాయకుడిపై 52 మంది జాబ్ కార్డుదారులు డబ్బులడుగుతున్నాడని ఫిర్యాదు చేశారు. ఏపీడీ సత్యనారాయణ, అంబుడ్స్‌మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయండి

అమలాపురం కలెక్టరేట్: జిల్లాలో ప్రధాన పంట కాలువలు, డ్రెయిన్లలో టీఆర్ 27 కింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. పంట కాలువల్లో పూడికతీత, లాకుల షట్టర్లకు మరమ్మతులు, ఏటిగట్లకు రక్షణ పనులను నాణ్యంగా చేపట్టాలని, కాలువల్లో జేసీబీలతో వ్యర్థాలు తొలగించాలన్నారు. డీఆర్వో వెంకటేశ్వర్లు, ఈఈ శ్రీనివాసరావు, హెడ్‌వర్క్స్ అధికారులు పాల్గొన్నారు.

అబ్కారీ సీఐల బదిలీలు

అమలాపురం పట్టణం: జిల్లాలో అబ్కారీశాఖ సీఐల బదిలీలకు ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అమలాపురం స్టేషన్‌కు వీటీవీవీ సత్యనారాయణ, ఆలమూరుకు ఐడీ నాగేశ్వరరావు, ముమ్మిడివరానికి ఈ.స్వరాజ్యలక్ష్మి, కొత్తపేటకు కోటిపల్లి కాత్యాయని, రాజోలుకు కె.వీరబాబు, రామచంద్రపురానికి పి.శ్రీనివాస్ వస్తున్నారు.

గృహ నిర్మాణాలు చేపట్టండి

కాట్రేనికోన: ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లను నిర్మించుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం 'మన ఇల్లు.. మన గౌరవం' కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి సుధాకర్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, రాజేశ్వరరావు, శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులకు నివాళి

అమలాపురం పట్టణం, ఐ.పోలవరం: పట్టణంలోని ముమ్మిడివరంగేట్ ప్రాంతాన్ని సర్దార్ భగత్ సింగ్ కేంద్రంగా మారుస్తున్నట్లు మున్సిపాలిటీలో తీర్మానం జరిగిందని ఆజాద్ ఫౌండేషన్ నాయకులు తెలిపారు. అధ్యక్షుడు యెల్లమిల్లి కొండ ఆధ్వర్యంలో నాయకులు భగత్‌సింగ్ జయంతిని శనివారం నిర్వహించారు. ఏడిద శ్రీను, నల్లా అజేయ్, యెనుమల పద్మరాజు, ఆకెళ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఐ.పోలవరంలో నవయుగ కవి చక్రవర్తి జాషువా జయంతిని శనివారం నిర్వహించారు. పీటీఎం ఆధ్వర్యంలో వీధి సురేష్‌బాబు, ఉంగరాల వెంకటేశ్వరావు, పుల్లేపు వెంకటేశ్వరావు తదితరులు నివాళి అర్పించారు.

'అసత్య ప్రచారం చేస్తున్నారు'

అమలాపురం పట్టణం, ముమ్మిడివరం: తిరుమల ప్రసాదం లడ్డూ కల్తీపై సీఎం చంద్రబాబు నాయుడు అసత్య ప్రచారం చేస్తున్నారని మాజీ ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పేర్కొన్నారు. అమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జిల్లా వైకాపా నాయకులు శనివారం పూజలు నిర్వహించారు. సత్యనాగేంద్రమణి, నాని, నాగేంద్ర, రాజేష్ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం పాలనపై దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ అన్నారు. పల్లిపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ నాయకులతో కలిసి శనివారం పూజలు చేశారు.

వ్యాయామంతో జీవనశైలి మార్పు

ముమ్మిడివరం: నిత్యం వ్యాయామం చేయడం, మంచి జీవనశైలితో ఆరోగ్యవంత జీవితాన్ని గడపవచ్చని డాక్టర్ మంజీరా అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీపుల్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తటవర్తి నాగరాజారావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. ఎస్.ప్రభాకర్, పీపుల్స్‌సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కస్సేడి వెంకటేశ్వరరావు, అధ్యాపకులు తులసిలక్ష్మి, సురేష్, కల్యాణ్, భువనేశ్వరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని దీక్ష

అమలాపురం కలెక్టరేట్: గ్రామ, వార్డు వాలంటీర్లను తిరిగి తమను విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని వాలంటీర్లు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ వద్ద మౌన దీక్ష చేపట్టారు. నూతనంగా రాష్ట్ర అసోసియేషన్ స్థాపించి ఉద్యోగ భద్రతకు పోరాటం చేస్తున్నట్లు వారు తెలిపారు. సతీష్, సత్తిబాబు, అజయ్, రాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకోరా.. పాడైపోద్ది..!



ముల్లేటిమొగ ప్రాథమిక పాఠశాల చుట్టూ నీరు చేరడంతో ఆ పాఠశాల గోడలు పాడయ్యేలా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. తీర ప్రాంతం కావడంతోపాటు చుట్టూ ప్రహరీ లేకపోవడంతో మూడు భవనాల చుట్టూ నీరు నిలిచిఉంటోంది. సముద్రం ఆటుపోటుల సమయంలో నీరు మరింత చేరుతుంది. దాంతో గోడలు చెమ్మతో పటిష్టత కోల్పోతున్నాయి. కొన్నిచోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. అధికారులు పట్టించుకోకుంటే పడిపోతాయని, చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని పాఠశాల సిబ్బంది తెలిపారు.

– న్యూస్‌టుడే, కాట్రేనికోన

అలలపై వల బతుకు నావలా..



ఈ ఏడాది ఆరంభంలో సముద్రంలో వేట నిషేధం. ఆ తరువాత వరుస తుపానుల కారణంగా చాన్నాళ్లపాటు మత్స్యకారులకు జీవనోపాధి కాస్త దూరమయ్యింది. జిల్లాలోని తీర గ్రామాల్లో ప్రజలకు చేపలవేటే ప్రధాన వృత్తి. తీర మండలం కావడంతో కాట్రేనికోన శివారు గ్రామాల్లో ఎటుచూసినా చేలల్లో కర్షకులు.. సముద్రంలో జాలర్లు కనిపిస్తుంటారు. నీరు రంగుమారిన నీలరేవు సముద్ర తీరంలో వేటకు వెళ్లి పడవను, వలల్ని ఒడ్డుకు తెచ్చుకుంటున్న మత్స్యకారుల జీవన చిత్రమిది.

– న్యూస్‌టుడే, కాట్రేనికోన

వనితల గళం చెత్తపై సమరం..



బండారులంకలో నివాసగృహాల చెంతనే ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డును తక్షణమే మరో ప్రాంతానికి మార్చి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు శనివారం ఆందోళన చేశారు. తొలుత డంపింగ్‌యార్డు ప్రాంతం వద్ద మహిళలు ప్లకార్డులతో నినాదాలు చేశారు. పాదయాత్రగా పంచాయతీ కార్యాలయానికి చేరుకుని సమస్యను గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. అక్టోబరు 2వ తేదీలోపు పరిష్కరించకుంటే చెత్త ట్రాక్టర్లను అడ్డుకుంటామన్నారు. సర్పంచి సునీత, కార్యదర్శి సూరపరాజుకు వినతిపత్రాన్ని అందించారు. చింతా శంకరమూర్తి, గోళ్ల మల్లేశ్వరరావు, పిచ్చిక మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోండి


ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ఐ.పోలవరం, ముమ్మిడివరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బుచ్చిబాబు సూచించారు. పశువుల్లంకలో పోషకాహార మాసోత్సవం పురస్కరించుకుని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి విమల అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నేరేడిమిల్లి సత్యనారాయణ దంపతులు గర్భిణులకు చీరలందించారు. సర్పంచి పెద్దిరాజు, వివేకానంద, చక్రం, రాంబాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ✦ నగర పంచాయతీ ఛైర్మన్ కిమిడి ప్రవీణ్‌కుమార్ ముమ్మిడివరంలోని మెప్మా కార్యాలయం వద్ద ఐసీడీఎస్ అధికారులు శనివారం ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారంభించారు. బాలకృష్ణ, వీరాస్వామినాయుడు, కమల, సత్తిబాబు, నాగు, శ్రీమన్నారాయణ, రుక్మిణి, కమల పాల్గొన్నారు. ✦ రైతులకు మెరుగైన సేవలందించాలని బుచ్చిబాబు సహకారసంఘ అధికారులకు సూచించారు. మురమళ్ల సహకార సంఘ కార్యాలయంలో శనివారం జరిగిన మహాజనసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, డివిజనల్ అధికారి రాధాకృష్ణ, బ్రాంచి మేనేజర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

యువత నృత్యాల కేరింత



అమలాపురం మండలం భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో పరిచయ్ 2కె 24 పేరుతో మూడు రోజులపాటు జరుగుతున్న కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. యువత రెట్టించిన ఉత్సాహంతో నృత్యాలు చేశారు. యువతులు తమ ప్రతిభను చాటారు. విద్యార్థులను కళాశాల అధినేత కనకయ్య, ఛైర్మన్ కృష్ణసతీష్ అభినందించారు. రామారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

విద్యార్థుల స్వచ్ఛభారత్



స్వచ్ఛతా హీ సేవా వేడుకల్లో భాగంగా మెట్టకూరులోని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ హైస్కూలు విద్యార్థులు శ్మశానవాటికను ఆనుకుని ఉన్న ఏటిగట్టు మార్గంలో శనివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. హెచ్ఎం రాజారామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో పీఈటీ శేరు విష్ణు సీఎస్ఎస్ విద్యార్థులతో చెత్త, ముళ్లచెట్ల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు.

– న్యూస్‌టుడే, యానాం

పండ్ల మొక్కల పంపిణీ



కాట్రేనికోన: కాట్రేనికోన మాజీ సర్పంచి మోకా చక్రధరరావు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. ఆయన దశ దిన కర్మను పురస్కరించుకుని కుమారులు తమ తండ్రి జ్ఞాపకార్థం గ్రామస్థులకు వెయ్యి పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో తమ తండ్రి ఎప్పుడూ ముందుండేవారని ఆయన ఆశయ సాధనలో భాగంగా మొక్కలు పంపిణీ చేశామని కుమారులు నాని, తెదేపా నాయకుడు అప్పాజీ, స్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు వారిని అభినందించారు.

సమున్నత లక్ష్యం.. సంపదకు దూరం

– న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం, కాట్రేనికోన

పంచాయతీల్లో సంపద కేంద్రాల నిర్మాణం పూర్తికాలేదు. దాంతో పారిశుద్ధ్య సమస్యకు మోక్షం లభించడం లేదు. పంచాయతీలకు ఆదాయమూ రావడం లేదు. ప్రతి పంచాయతీలో సుమారు రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో సంపద కేంద్రాలు నిర్మించడానికి తెదేపా ప్రభుత్వం 2014-19 మధ్య అధికారంలో ఉండగా చర్యలు తీసుకుంది. అయిదేళ్ల వైకాపా పాలనలో పట్టించుకోక చాలాచోట్ల పునాది దశలోనే కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వమే వీటిని అందుబాటులోకి తేవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉప్పలగుప్తం మండలంలో..

✦ సంపద కేంద్ర నిర్మాణం: కూనవరంలో నిర్మాణానికి నోచుకోలేదు.
✦ కిత్తనచెరువులో ప్రారంభించలేదు.
✦ ఎన్.కొత్తపల్లిలో పైకప్పు దశలో ఆగింది.
✦ సన్నవిల్లి, వానపల్లిపాలెంలలో పునాదుల్లో ఆగింది.
✦ మిగిలిన గ్రామాల్లో ఉన్నా.. పారిశుద్ధ్య సిబ్బంది కొరత వేధిస్తోంది.


కాట్రేనికోనలో నిరుపయోగంగా నిర్మాణాలు


ఎన్.కొత్తపల్లిలో మధ్యలో నిలిచిన సంపద తయారీ కేంద్ర నిర్మాణం

కాట్రేనికోన పరిధిలో..

✦ కాట్రేనికోనలో కొన్ని కేంద్రాల్లో అసాంఘిక కార్యకలాపాలు. (ఇదే కేంద్రంలో గత తెదేపా హయాంలో ఎరువుతో ఆదాయం)
✦ పెనుమళ్ల, లక్ష్మీవాడ, కుండలేశ్వరం, నడవపల్లి, కొప్పిగుంటలలో నిరుపయోగం.
✦ బలుసుతిప్ప, పల్లం వంటి తీర గ్రామాల్లో నిర్మించాల్సిఉంది.
✦ చిర్రయానాం సంపద కేంద్రం రేకులషెడ్డు తుప్పపట్టిపోతోంది.

అన్నిచోట్లా నిర్మాణాలు పూర్తి చేస్తాం

రెండు మండలాల్లో ఎక్కడెక్కడ సంపద తయారీ కేంద్రాల నిర్మాణం నిలిచిందో పరిశీలిస్తాం. వాటన్నింటినీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. ఇంకా నిర్మించాల్సిన షెడ్లకోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం.

- వెంకటేశ్వరప్రసాద్, వెంకటాచలం, ఎంపీడీవోలు

మండపేట

•మండపేట • రామచంద్రపురం

రేబిస్ వ్యాధిపై అవగాహన

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల పశువైద్యాధికారి ఎం.కృష్ణార్జున శనివారం ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిచ్చికుక్క కరిచిన వెంటనే సబ్బుతో ఎక్కువసేపు శుభ్రం చేయాలని తర్వాత 0, 3, 7, 14, 28 రోజుల్లో టీకాలు వేయించుకోవాలన్నారు. రేబిస్ వ్యాధికి చికిత్స లేదని.. ఏటా పెంపుడు కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవడం ఒక్కటే నివారణ మార్గమని వివరించారు. పిచ్చి కుక్క కరవడం వల్ల, మనుషులతోపాటు ఇతర జంతువులకు కూడా వ్యాధి సోకుతుందన్నారు. కోతులు, గబ్బిలాలు, నక్కలు, ఎలుకల ద్వారా కూడా ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

రాయవరం, న్యూస్‌టుడే: మండలంలోని వెదురుపాకలో అయ్యప్పస్వామి పడిపూజ శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయ ప్రాంగణంలో గురుస్వామి బండారు వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో స్వామి వారి ఉత్సవమూర్తికి 22 రకాల పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. కొంకుదురుకు చెందిన రమణశర్మ అయ్యప్పమాలధారులతో పూజలు చేయించారు. గురు స్వాములు రమణ, శ్రీరాములు, త్రిమూర్తులు, వెంకటసుబ్బారావుని సత్కరించారు. వివిధ గ్రామాలకు చెందిన 300 మంది అయ్యప్పమాలధారులు పడిపూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యల పరిష్కారంపై దృష్టి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: జిల్లాలో విద్యుత్తు సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తామని ఆ శాఖ ఎస్ఈ సిద్దెల రాజబాబు తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా రామచంద్రపురంలోని విద్యుత్తు శాఖ కార్యాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నూతన రిజిస్ట్రేషన్, సమస్యలపై 1912 నంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ కె.రత్నాలరావు, ఏఈడీ కంచుమర్తి మురళీమోహన్, ఏఈ మేడిశెట్టి వెంకటరమణ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎక్సైజ్ డీసీ

మండపేట, న్యూస్‌టుడే: మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును ఎక్సైజ్ ఉప కమిషనర్ ఏనుగుల చైతన్య మురళి శనివారం మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేశారు.

రామచంద్రపురం ఎస్సైగా శ్రీనివాస్



రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం ఎస్సైగా ఎస్.శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన వీఆర్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన వాసును ఇటీవల వీఆర్‌లోకి పంపించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని కొత్త ఎస్సై తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

మండపేట గ్రామీణం: మండపేట డిగ్రీ కళాశాలలో చదువుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు గుంటూరుకు చెందిన సంవర్ధన ట్రస్ట్ రూ. 60 వేలు ఆర్థిక సాయం అందించింది. ఆ చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ టీకేవీ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ డాక్టర్ జె.నెహ్రూ నాయక్, మధుకుమార్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

రేవు పాట వాయిదా

పామర్రు, న్యూస్‌టుడే: కోనసీమ ముఖద్వారంగా భాసిల్లుతున్న కోటిపల్లి-ముక్తేశ్వరం రేవుకు ఈ నెల 30న జరపతలపెట్టిన బహిరంగ వేలాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు వెల్లడించారు. జిల్లా కలెక్టరు ఉత్తర్వుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని, తదుపరి తేదీని త్వరలో వెల్లడిస్తామన్నారు.

వీఆర్‌ఏ శ్రీరాములు మృతికి సంతాపం

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం గ్రామ రెవెన్యూ సహాయకుడు మల్లేశ్వరపు శ్రీరాములు(85) శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. సుమారు ఆరు దశాబ్దాలుగా రెవెన్యూ శాఖలో సేవలందించిన శ్రీరాములు మృతిపట్ల తహసీల్దారు ఐ.పి.శెట్టి, ఆర్ఐ. పంపన రామారావు సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియల ఖర్చులుగా రూ.15 వేలు మృతుడి కుటుంబానికి అందజేసినట్లు తెలిపారు.

న్యూస్‌టుడే, అంగర, పామర్రు, రాయవరం, ద్రాక్షారామం, మండపేట గ్రామీణం

అధ్యాపకుల్లేక.. బోధన సాగక

మిథ్యగా హైస్కూల్ ప్లస్ విద్య

'హైస్కూల్ ప్లస్ పేరిట కళాశాలలైతే ఏర్పాటు చేశారుగాని సరైన విధి విధానాలు, నియామ నిబంధనలు లేవు. అవసరమైనంత మంది మేరకు బోధకులు లేరు. ప్రయోగశాలల మాటే లేదు. వీటి ప్రభావం ఇంటర్ ఫలితాలపై ప్రస్ఫుటమవుతోంది. వీటిని చూసి కళాశాలల్లో చేరడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఒకవేళ వచ్చినా వారికి న్యాయం చేయలేకపోతున్నాం. అంతా కలిసి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు.'

హైస్కూల్ ప్లస్ కళాశాలలో పని చేస్తున్న ఓ అధ్యాపకుడి ఆవేదన..

విద్యకు పెద్ద పీట వేస్తున్నాం.. విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తామని గొప్పలు చెప్పిన గత వైకాపా ప్రభుత్వం ప్లస్ టూ పేరిట జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసింది. ఉన్నత పాఠశాలలోనే ఇంటర్ విద్య అంటూ ప్రచారం చేసింది. పదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఉన్నతీకరిస్తున్నామని చెప్పి రెండేళ్ల కిందట మండలానికో ఉన్నత పాఠశాలను ఎంపిక చేసి.. ఇంటర్ తరగతులు ప్రారంభించింది. ఈ ఏడాది కూడా గతంలో మాదిరిగానే అనుమతులు ఇవ్వడంతో మరికొన్ని కోర్సులు పెంచి, తరగతులు మొదలుపెట్టారు. కానీ ఆయా కళాశాలల్లో సరియైన సౌకర్యాలు కూర్చలేదు. అధ్యాపకుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్లస్-2 కళాశాలల్లో గతంతో పోలిస్తే విద్యార్థుల సంఖ్య సైతం గణనీయంగా పడిపోయింది. సౌకర్యాలు లేకపోవడంతో కళాశాలలో చేరండి అని చెప్పే ధైర్యం చేయలేక అధ్యాపకులు సైతం చూస్తూ ఉండిపోతున్నారు.

మండపేట క్లస్టర్ పరిధిలో..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని దంగేరు, ద్రాక్షారామ, ఏడిద, రాయవరం, మాచర, అంగర ఉన్నత పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్ కళాశాలలు [illegible] తూతూమంత్రంగా బోధన సాగుతోంది. సబ్జెక్టు బోధకులు లేక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులే కష్టపడి పాఠాలు చెబుతున్నారు. గతేడాది ఉత్తీర్ణత శాతం బాగా తక్కువగా నమోదు కావడంతో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. వచ్చే విద్యా సంవత్సరానికి సరైన వసతులు, అధ్యాపకులను నియమించకపోతే మూతపడే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత విద్యా సంవత్సరం ఫలితాలు ఇలా..

మండలం	కళాశాల	ప్రథమ సంవత్సరం హాజరు	ప్రథమ సంవత్సరం ఉత్తీర్ణత	ద్వితీయ సంవత్సరం హాజరు	ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత
కె.గంగవరం	దంగేరు	07	01	08	01
రాయవరం	రాయవరం	00	00	05	00
మండపేట	ఏడిద	17	06	17	03
రామచంద్రపురం	ద్రాక్షారామ	09	01	09	00
కపిలేశ్వరపురం	మాచర	03	01	12	10

ఇదీ ప్రస్తుత పరిస్థితి..

పరిశీలన

● కపిలేశ్వరపురం మండలం అంగరలో ఈ ఏడాది నూతనంగా హైస్కూల్ ప్లస్ కళాశాలను ప్రారంభించారు. ఇక్కడ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీఈసీ, ఎంపీసీ గ్రూపులున్నాయి. ఒక్కో గ్రూపులోనూ ఆరుగురు చొప్పున మొత్తం 12 మంది విద్యార్థులున్నారు. పౌర, రసాయన, వాణిజ్య, ఆర్థిక శాస్త్రం బోధించడానికి సబ్జెక్టు బోధకులు లేరు. ● మాచరలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు కలిపి 14 మంది విద్యార్థులు ఉంటే వృక్ష, జంతుశాస్త్ర అధ్యాపకులు లేరు. ● రాయవరం హైస్కూల్ ప్లస్ కళాశాలలో ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఇక్కడ వృక్ష, పౌరశాస్త్ర అధ్యాపకుల కొరత ఉంది. ● మండపేట మండలం ఏడిదలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 25, ద్వితీయ సంవత్సరంలో 23 మంది విద్యార్థులున్నారు.



అంగర హైస్కూల్ ప్లస్ కళాశాలలో ఓ తరగతి గది

ఇక్కడ రసాయన శాస్త్రం బోధించడానికి అధ్యాపకులు లేరు. ● ద్రాక్షారామ కళాశాలలో 43 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ మాత్రమే అన్ని సబ్జెక్టులు బోధించడానికి అధ్యాపకులు ఉన్నారు. ● కె.గంగవరం మండలం దంగేరులో 34 మంది విద్యార్థులుంటే భౌతిక, రసాయన, పౌర శాస్త్రం, చరిత్ర బోధకులు లేకపోవడంతో విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.

పోస్టుల భర్తీకి చర్యలు..

హైస్కూల్ ప్లస్ కళాశాలల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలనే ఆలోచన ఉంది. ఇప్పటికే నాలుగు విడతలుగా పీజీ చేసిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించాం. అయినప్పటికీ ఇంకా కొన్ని ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే మళ్లీ భర్తీ ప్రక్రియ చేపడతాం. ఈ ఏడాది చేరిన విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలు ఉచితంగా ఇచ్చాం. చేరికలు పెరగడానికి గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నాం.

- శ్రీపాద శ్రీలక్ష్మీ నరసింహ ఫణి, డీవైఈవో

అన్ని పాఠశాలల్లో స్వచ్ఛత కార్యక్రమాలు

అంగర, న్యూస్‌టుడే: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని అన్ని యాజమాన్య పాఠశాలల్లో అమలుచేయాలని సమగ్ర శిక్షా సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యం సూచించారు. ఆయన శనివారం కపిలేశ్వరపురం, అంగర జడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించి కార్యక్రమం అమలును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మానవహారంలో పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన పదార్థాలను పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం ప్రత్యేక అవసరాలు గల పిల్లల గృహాలను ఐఈఆర్పీలతో కలిసి సందర్శించి వారికి అందిస్తున్న గృహ ఆధారిత విద్యను పరిశీలించి, చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్షా సీఎంవో సుబ్రహ్మణ్యం

అర్తమూరులో వీధులు శుభ్రం..

మండపేట గ్రామీణం: అర్తమూరులో పలువీధులను తెదేపా నాయకులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి వీరి్రెడ్డి, ఉప సర్పంచి కర్రి జంబయ్య, సొసైటీ మాజీ అధ్యక్షులు పడాల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న డీఐఈవో శ్రీపాద లక్ష్మీ నరసింహ ఫణి

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు కృత్తివెంటి విద్యార్థులు

రామచంద్రపురం: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయోన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు తాడి వీరరాఘవరెడ్డి తెలిపారు. ఈ నెల 26న కాకినాడలోని డీఎస్ఏ గ్రౌండ్‌లో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ పోటీలు అండర్-19, 17, 14 విభాగాల్లో పాఠశాలకు చెందిన జి.పావని కుమారి, డి.అపర్ణ, సీహెచ్.ఐశ్వర్యాంబిక ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిని డీవైఈవో శ్రీపాద లక్ష్మీ నరసింహ ఫణి, ఎస్ఎంసీ ఛైర్మన్ కె.వి.ఎస్.ఎస్.గంగరాజు తదితరులు అభినందించారు.

మండపేటలో పులి సంచారంపై వదంతులు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట శశి పాఠశాల వెనుక బొప్పాయి తోటలో కనిపించిన పాదముద్రలు చిరుతపులివే అంటూ వదంతులు రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. దీంతో మండపేట పోలీసులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. తూర్పు గోదావరి జిల్లా డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి పద్మావతి సిబ్బందితో అక్కడికి చేరుకొని పాదముద్రలను పరిశీలించి, కొలతలు తీసి పులివి కావని నిర్ధారించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



పరిశీలిస్తున్న అటవీశాఖాధికారులు

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ఈనాడు మీతోడు

ద్వారపూడి, న్యూస్‌టుడే: భావి తరాలను వాతావరణ కాలుష్యం నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని కేశవరం గ్రామ తెదేపా నాయకులు పిలుపునిచ్చారు. 'ఈనాడు-మీతోడు' కార్యక్రమంలో భాగంగా శనివారం కేశవరం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులతో కలిసి కొబ్బరి, మామిడి, వేప తదితర సుమారు 10 మొక్కలు నాటారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కర్రి తాతారావు, కంటిపూడి శ్రీనివాస్, పంతులపూడి సురేష్, ఆళ్ల రాజు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పెదపాటి విష్ణు, మట్టపర్తి శ్రీను, గణేషుల రాజు, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న తెదేపా నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

ఇప్పటికైనా గ్రహణం వీడేనా..?

ద్రాక్షారామలో వైఎస్ఆర్ క్రీడా వికాస భవన నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా అధికారులు ప్రారంభోత్సవం మాటెత్తడం లేదు. గత తెదేపా హయాంలో నిర్మాణం పూర్తయింది. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ప్రారంభించకుండా వదిలేసింది. ప్రస్తుతం మళ్లీ తెదేపా అధికారంలోకి వచ్చింది. ఇప్పుడైనా ప్రారంభించకపోతారా అని క్రీడాభిమానులు ఆశతో ఎదురు చూస్తున్నారు. అప్పట్లో దీనిని ఊరికి నడిబొడ్డున ఉన్న పశువుల సంత ప్రాంగణంలో సుమారు రూ.2 కోట్లతో నిర్మించారు. సుమారు రెండేళ్లపాటు సాగిన నిర్మాణ ప్రక్రియ పూర్తయ్యే సరికి ప్రభుత్వం మారిపోయింది. వైకాపా అధికారంలో ఉండగా క్రీడల మంత్రి అవంతి శ్రీనివాసరావుతో ప్రారంభించడానికి తేదీని కూడా నిర్ణయించారు. కానీ అనివార్య కారణాలతో కార్యక్రమం వాయిదా వేశారు. అప్పటి నుంచి తిరిగి పట్టించుకోలేదు. అందుబాటులో ఉన్న భవనం అక్కరకు రాకపోవడంతో క్రీడాభిమానులు నిరుత్సాహానికి గురవుతున్నారు. స్థానికంగా ఇండోర్ స్టేడియం ఉంటే క్రీడల్లో మెరుగ్గా రాణించవచ్చని పలువురు ఎదురు చూస్తున్నారు. కోట్లు ఖర్చు చేసి నిర్మించిన భవనాన్ని ఇప్పటికైనా ప్రారంభించాలని వారంతా కోరుతున్నారు.



– న్యూస్‌టుడే, ద్రాక్షారామ

ఆరోగ్య ఉపకేంద్రం.. బురదమయం

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం చిన్న కోరుమిల్లిలోని ఆరోగ్య ఉపకేంద్రం బురదమయంగా మారింది. ఓ మోస్తరు వర్షానికే రోడ్డుపై నీరంతా లోపలికి చేరుతుంది. ఇక్కడ ప్రత్యేక భవనం లేకపోవడంతో ఖాళీగా ఉన్న పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ భవనంలో ఆరోగ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఉపకేంద్రం అరుగు కంటే ఎదుగా ఉన్న రహదారి ఎత్తుగా ఉండడంతో వర్షపు నీరు కేంద్రం లోపలికి చేరుతోంది. రోగులు బురదలో నడవలేక అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అబ్కారీ సీఐగా శ్రీనివాస్

అమలాపురం పట్టణం: జిల్లాలో అబ్కారీశాఖ సీఐల బదిలీలకు ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా రామచంద్రపురానికి పి.శ్రీనివాస్ నియమితులయ్యారు.

వేతనాలు చెల్లించాలని నిరసన

మండపేట గ్రామీణం: వేతనాలు చెల్లించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు శనివారం అర్తమూరు జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు.

ఆరు నెలల్లో గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

అంగర, రాయవరం, మండపేట గ్రామీణం, ద్వారపూడి: గతంలో రుణాలు పొందిన లబ్ధిదారులు గృహ నిర్మాణాలను ఆరు నెలల్లో పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ డీఈ కె.శ్రీనివాసరెడ్డి సూచించారు. 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా కపిలేశ్వరపురం, రాయవరం మండలం నదురుబాద, వెదురుపాక, లొల్ల, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, మండపేట మండలం అర్తమూరు, కేశవరంలో శనివారం లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కపిలేశ్వపురంలో జరిగిన కార్యక్రమంలో డీఈ మాట్లాడుతూ ఇనుము, సిమెంటు గృహ నిర్మాణ శాఖ ద్వారా అందజేస్తామన్నారు. సిమెంటు ఇటుకలను ఉపయోగించి తక్కువ ఖర్చుతో నిర్మాణాలు పూర్తయ్యేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి, ఎంపీడీవో కొండలరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో డి.శ్రీనివాస్, సర్పంచి శాకా శ్రీనివాస్, తెదేపా గ్రామ శాఖ అధ్యక్షుడు కర్రి తాతారావు, వార్డు సభ్యుడు కంటిపూడి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు శివ చక్రవర్తి, ఎస్.వి.సుబ్బారావు, సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ శ్రీనివాసరెడ్డి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రాయవరం, అంగర, మండపేట గ్రామీణం: పౌష్టిహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, గర్భిణులంతా పౌష్టికాహారం తీసుకోవాలని వక్తలు సూచించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రాయవరం, కపిలేశ్వరపురం మండలం కేదార్లంక, మండపేట మండలం ఏడిదలో శనివారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అధిక క్యాలరీలు లభించే పలు తినుబండారాలను అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసి ప్రదర్శించారు. రాయవరంలో తెదేపా నాయకుడు వుండవిల్లి రాంబాబు సహకారంతో 20 మంది గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు, తదితరాలు అందించారు. రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు వెదురుపాకకు చెందిన అర్జున్ పది కుర్చీలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సీడీపీవో గజలక్ష్మి, రాయవరం ఎంఈవో యరమాటి సూర్యనారాయణ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో డి.శ్రీనివాస్, కేదార్లంక సర్పంచి వీధి వెంకటరెడ్డి, మాజీ సర్పంచి రంకిరెడ్డి సత్యవతి, మండపేట మండల ఉపాధ్యక్షుడు పసుమర్తి నాగేశ్వరరావు, తెదేపా గ్రామ అధ్యక్షుడు పర్వతిన వీర్రాజు, గ్రామ జనసేన అధ్యక్షులు రామిశెట్టిరాజా కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రాయవరంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీవో గజలక్ష్మి

'దోషులను వేంకటేశ్వరస్వామే శిక్షిస్తారు'

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో తప్పుడు విధానాలకు పాల్పడిన వ్యక్తులను వేంకటేశ్వరస్వామి వారే శిక్షిస్తారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. స్థానిక కలువపువ్వు సెంటర్‌లోని వెంకన్న ఆలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, వైకాపా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తిరుమల లడ్డూ వ్యవహారాన్ని కావాలని రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. లడ్డూ కల్తీ ఆరోపణలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించాలని కోరారు. ఆలయంలో పూజలను అడ్డుకుంటామని కూటమి నాయకులు ప్రకటనలు సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు రెడ్డి రాధాకృష్ణ, మూడు మండలాల జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. పట్టణ ఎస్సై హరికోట శాస్త్రి ఆలయం వద్ద ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ తోట, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నూకదుర్గారాణి తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: రామచంద్రపురం 5వ వార్డు వైఎస్సార్ నగర్‌లో మురుగు కాలువలను వారానికి ఒక రోజైనా శుభ్రం చేయట్లేదు. దుర్వాసన వస్తుండడంతో పరిసరాల్లోని వారు ఇబ్బందిపడుతున్నారు.

-కోటేశ్వరరావు, వైఎస్సార్ నగర్

సమాధానం: వైఎస్సార్ నగర్‌లో మురుగు కాలువలను శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. **-డేవిడ్‌రాజు, శానిటరీ తనిఖీదారు**

సమస్య: మండపేట మండలం ద్వారపూడి డ్రైవర్స్ కాలనీలో మురుగు పారడంలేదు. దోమలు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- రాంబాబు, ద్వారపూడి

సమాధానం: డ్రైవర్స్ కాలనీలో మురుగు పారుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

-ఆకుల వి.వి.రమణ, పంచాయతీ కార్యదర్శి

సమస్య: మండపేట మండలం జడ్.మేడపాడులోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల పక్కన చెత్త వేస్తున్నారు. దాన్నుంచి దుర్వాసన వస్తుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు స్థానికులు ఇబ్బందిపడుతున్నారు.

-స్థానికులు, జడ్.మేడపాడు

సమాధానం: ప్రాథమిక పాఠశాల పక్కన వేసిన చెత్త తొలగించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- వి.అమర్‌నాథ్ చౌదరి, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, ద్వారపూడి, రామచంద్రపురం

సమయం :	మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ. 10 గం|| నుంచి మ|| ఒంటి గంట మధ్య	ద్రాక్షారామ : 80085 74192
	ద్వారపూడి : 91543 96553

కాగుతున్న నూనె ధరలు

వంటింటి బడ్జెట్ తలకిందులు

ఈ నెలలో 13వ తేదీ వరకు లీటరు పామాయిల్ ప్యాకెట్ ధర రూ.90. పది రోజుల వ్యవధిలో రూ.110కి చేరింది. వారం రోజుల కిందట రూ. 100 ఉన్న పొద్దుతిరుగుడు నూనె ప్రస్తుతం రూ.130కి పెరిగింది. పల్లీ, తవుడు, నువ్వుల నూనెల ధరలు కూడా సమాంతరంగా పెరిగిపోయి సామాన్యులకు ఆందోళన కలిగిస్తున్నాయి. – న్యూస్‌టుడే, పామర్రు

నూనె ధరలు వింటుంటూనే వంటిళ్లు వణికిపోతున్నాయి. ముడి, రిఫైన్డ్ వంట నూనెలపై గతంలో ఎలాంటి పన్ను ఉండేది కాదు. కేంద్రం ఒక్కసారిగా వీటిపై దిగుమతి సుంకం పెంచడంతో గత కొన్ని రోజులుగా స్థిరంగా ఉన్న ధరలు ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి నుంచి ఒక్కసారిగా లీటరు ప్యాకెట్‌కు రూ.20కి పైగా పెరిగాయి. ఈ ప్రభావంతో సామాన్యుడి వంటింటి బడ్జెట్ గాడి తప్పింది. కేంద్రం వద్ద మొరపెట్టుకుంటే కంటి తుడుపు చర్యగా దిగుమతి సుంకాన్ని కొద్దిగా తగ్గించామని ప్రకటించారు. కానీ అమ్మకందారులు మాత్రం పెరిగిన ధరలే వసూలు చేస్తున్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో సుమారు 1,04,438 కుటుంబాలున్నట్లు అంచనా. ఈ లెక్కల నెలకు సగటున లక్ష లీటర్ల నూనె వినియోగించినా లీటరుకు రూ. 20 చొప్పున చూసుకుంటే రూ. 20 లక్షల వరకు అదనపు భారం పడుతోంది.

కల్తీలు, నల్లబజారు విక్రయాలకు అవకాశం..

బహిరంగ మార్కెట్లో వంట నూనెల ధరలు పెరగడంతో అక్రమార్కులకు వరమయ్యే అవకాశాలున్నాయి. విడి విక్రయాల పేరుతో కల్తీ నూనె అంటగట్టే ప్రమాదం ఉంది. రోడ్డు పక్క నుండే అల్పాహారశాలలు, చిన్న చిన్న హోటళ్లు, మాంసాహార దుకాణాల నిర్వాహకులు ఎక్కువగా విడి నూనెలు కొనుగోలు చేస్తుంటారు. పట్టణాల్లో హోల్‌సేల్ ధరలకు విడిగా డబ్బాల్లో కొనుగోలు చేసి పల్లెల్లో విక్రయించే వ్యాపారులూ ఉన్నారు. పల్లెల్లో కిరాణా దుకాణాల్లోనూ ఈ తరహా అమ్మకాలుంటాయి. ధరలు పెరిగిన నేపథ్యంలో నూనెల్లో కల్తీ పెరగడానికి అవకాశం ఉంది. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు నల్లబజారులో కూడా విక్రయించడానికి వెనుకాడరు.



తరచూ దాడులు నిర్వహిస్తాం..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో వంట నూనెల ధరలు అందుబాటులో ఉండేలా నిల్వలపై విజిలెన్సు, పౌర సరఫరాల శాఖ అధికారులు దృష్టి పెట్టారు. తరచూ దాడులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో హోల్‌సేల్ పాయింట్లు ఎక్కడా లేవు. వ్యాపారులంతా బయట నుంచి తెచ్చుకోవాల్సిందే. నూనెలు కల్తీ చేసినా, పరిమాణంలో తేడాలున్నా, నాణ్యతా ప్రమాణాలు తక్కువగా ఉన్నా సదరు వ్యాపారులపై చర్యలు తప్పవు.

- కె.సూర్యారావు, తహసీల్దారు, కె.గంగవరం

అసత్య ప్రచారంతో తిరుమల ప్రతిష్టకు దెబ్బ

ద్రాక్షారామ: తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ జరిగిందని అసత్య ప్రచారం చేస్తూ ఆలయ ప్రతిష్ఠను ముఖ్యమంత్రి దెబ్బతీస్తున్నారని రామచంద్రపురం నియోజకవర్గ వైకాపా కన్వీనర్ పిల్లి సూర్యప్రకాష్ విమర్శించారు. చంద్రబాబు పాపాలు ప్రక్షాళన చేయాలని కోరుతూ శనివారం ద్రాక్షారామలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన పూజలు చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ పంపన నాగమణి, జడ్పీటీసీ సభ్యుడు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం మండలం నరసాపురపుపేట మెర్ల అంబికేశ్వరరావు సత్రం వద్ద శనివారం గుర్తుతెలియని వృద్ధుడు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వయస్సు దాదాపు 80 సంవత్సరాలు ఉంటుంది. వీఆర్ఏ ఫిర్యాదు మేరకు రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.